ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY 7
విశాఖపట్నం
జిల్లా వార్తలు
మంగళవారం 14 జనవరి 2025





సంబరంగా భోగి

ఘనంగా జరుపుకున్న నగర వాసులు

- ప్రతి వీధిలో భోగి మంటలతో సందడి
- సింహగిరిపై అంబరాన్నంటిన సంబరాలు
- బీచ్‌రోడ్డులో పర్యావరణహితంగా ఆవు పిడకలతో భోగిమంట
- విద్యుత్ బిల్లులు భోగిమంటల్లో వేసి సీఐటీయూ వినూత్న నిరసన



సీతమ్మధారలో వీధి పొడవునా భోగి మంటలు వేసిన స్థానికులు

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి కి ముందురోజు జరిగే భోగి పండుగను నగరవాసులు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచే అపార్టుమెంట్లు, కాలనీల్లో యువత సంప్రదాయ దుస్తులు ధరించి ఎక్కడికక్కడ భోగి మంటలు వేశారు. చిన్నారుల నుంచి వయోవృద్ధుల వరకూ అందరూ భోగి మంటల వద్ద చలికాస్తూ పండగను ఎంజాయ్ చేశారు. సింహాగిరిపై భోగి సంబరాలు అంబరాన్ని తాకాయి. ఏటా సింహగిరిపై సంక్రాతి సంబరాలు రెండురోజులు నిర్వహిస్తారు. ఆలయ ఈవో వేంద్ర త్రినాథరావు కొండపై సంక్రాంతి సంబరాలను సోమవారం ప్రారంభించారు. కొండపై గ్రామీణ వాతావరణాన్ని తలపించేలా ఏర్పాటుచేసిన సెట్ సందర్శకులను ఆకట్టుకుంది. సంక్రాంతి నాటికి గ్రామీణ ప్రాంతాల్లో ఉండే పరిస్థితులు ప్రతిబంబించేలా వరి కుప్పలు, ఎద్దులు, ట్రాక్టర్లు, పూరిగుడిసెలు, ధాన్యపురాశులు వేశారు. డూడూ బసవన్నలు, హరిదాసుల కీర్తనలు, తప్పెటగుళ్లు, మహిళల చెక్కభజన, కుమ్మరిచక్రంతో మట్టి ప్రమిదల తయారీ, పులివేషాలు, సాంస్కృతిక కార్యక్రమాలు కట్టిపడేశాయి. కొండపైకి భారీ సంఖ్యలో భక్తులు చేరడంతో సందడి వాతావరణం నెలకొంది. యువతులు, మహిళలు ధాన్యపురాశుల్లో నుంచి చేతితో ధాన్యాన్ని తీసి గాలిపడుతూ గ్రామీణ ప్రాంత అనుభూతులను సొంతంచేసుకున్నారు. సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్ వద్ద భోగి మంటలు వేసి అపార్ట్‌మెంట్‌లోని నివాసితులు పండగ చేసుకున్నారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో విద్యుత్ చార్జీల పెంపుని నిరసిస్తూ కరెంట్ బిల్లులను భోగిమంటల్లో వేసి తమ నిరసన తెలిపారు. పద్మనాభం మండలం కృష్ణాపురంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వశాఖల్లో ఉద్యోగాలు చేస్తున్న 25 మంది సంప్రదాయ వస్త్రధారణతో సామూహిక ... మిగతా 8వ పేజీలో



సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో భోగి మంట వద్ద అపార్టుమెంటు మహిళల సందడి

నగరం... నిర్మానుష్యం

సంక్రాంతికి స్వస్థలాలకు తరలివెళ్లిన ప్రజలు

- ఖాళీగా దర్శనమిస్తున్న ప్రధాన కూడళ్లు
- బీచ్, జూపార్క్‌లో గణనీయంగా తగ్గిన సందర్శకుల రద్దీ



నిర్మానుష్యంగా మారిన ఆర్టీసీ కాంప్లెక్స్ జంక్షన్

(ఆంధ్రజ్యోతి, విశాఖపట్నం)

నిత్యం రద్దీగా కనిపించే నగరం సోమవారం నిర్మానుష్యంగా మారిపోయింది. సంక్రాతి పండగను సొంతూర్లో ఘనంగా జరుపుకునేందుకు పల్లె వాసులంతా తరలిపోవడంతో నిత్యం జనసమ్మర్దంతో కనిపించే రోడ్లు ఖాళీగా దర్శనమించ్చాయి. బీచ్‌రోడ్డుతో పాటు జూపార్కులో కూడా సందర్శకుల తాకిడి లేకపోవడంతో నగరం బోసిపోయినట్టయింది.

తెలుగు ప్రజలకు సంక్రాంతి అత్యంత ప్రధాన పడగ. ఉద్యోగం, వ్యాపారం, ఉపాధి, విద్య కోసం ఎక్కడెక్కడికో వెళ్లి స్థిరపడినవారు సైతం సంక్రాంతికి స్వస్థలాలకు వచ్చి పండగ జరుపుకుంటారు. కుటుంబసభ్యులు, బంధువులతోపాటు స్నేహితులంతా ఒకచోట చేరి జ్ఞాపాలను గుర్తుచేసుకుని, ఆనందంగా గడుపుతారు. నగరంలో నివసిస్తున్నవారిలో అత్యధికులు ఉత్తరాంధ్రతోపాటు పాటు వేర్వేరు ప్రాంతాలకు ... మిగతా 8వ పేజీలో

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జీవీఎంసీ యుద్ధం

ఈ నెల ఒకటి నుంచి నిషేధం

- 575 బృందాలతో నిరంతర తనిఖీలు
- 500 మంది వ్యాపారుల నుంచి రూ.6 టన్నుల ప్లాస్టిక్ సీజ్
- వచ్చేనెల ఒకటి నుంచి జరిమానా



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

పర్యావరణానికి పెనుముప్పుగా మారిన సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్‌ను పూర్తిస్థాయిలో నిషేధించేందుకు జీవీఎంసీ పటిష్టమైన కార్యచరణ అమలు చేస్తోంది. ప్రతి వార్డు సచివాలయం యూనిట్‌గా బృందాలను ఏర్పాటుచేసి దుకాణాల్లో ముమ్మర తనిఖీలు చేస్తోంది. గత 12 రోజుల్లో సుమారు 500 దుకాణాలపై దాడులుచేసి ఆరు టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. ప్రస్తుతానికి హెచ్చరికతో వదిలిపెడుతున్నప్పటికీ వచ్చేనెల ఒకటి నుంచి భారీ జరిమానా విధిస్తామని కమిషనర్ పి.సంపత్‌కుమార్ హెచ్చరించారు.

జీవీఎంసీ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ కలిగిన 53 వేల దుకాణాలున్నాయి. లైసెన్స్ లేకుండా మరో ఐదు వేల వరకు ఉండవచ్చునని అంచనా. వీరు కాకుండా దాదాపు 33 వేల వీధి వ్యాపారులున్నారు. వీరంతా రోజుకు 15 టన్నుల వరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగిస్తున్నారు. ఈ కారణంగా పర్యావరణానికి తీవ్రనష్టం జరుగుతోందని అధ్యయనాల్లో తేలింది. దీంతో దీనిని నిషేధించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని పట్టణ స్థానిక సంస్థలను ఆదేశించాయి. బయోడీగ్రేడబుల్ ప్లాస్టిక్ లేదా కాగితం, చెక్కతో తయారైన వస్తువులను వినియోగించాలా చూడాలని సూచించాయి. దీంతో జీవీఎంసీ కమిషర్ సంపత్‌కుమార్ దశలవారీగా కార్యాచరణ అమలుచేయాని నిర్ణయించారు. ప్రజలు, వ్యాపారుల్లో అవగాహన, చైతన్యం పెంచాలని నిర్ణయించి, గత ఏడాది నవంబరు, డిసెంబరులో విరివిగా ప్రచారం చేయడంతోపాటు మహిళా సంఘాలు, ఎన్‌జీవోలతో సమావేశాలు ఏర్పాటు చేశారు.

సచివాలయం స్థాయిలో కమిటీలు

ఈ ఏడాది జనవరి ఒకటి నుంచి సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధిస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు వార్డు సచివాలయం స్థాయిలో ప్రత్యేక కమిటీలను ఏర్పాటుచేశారు. నిషేధంపై ఇంటింటికీ ప్రచారం చేయడంతోపాటు విక్రయించే దుకాణాలపై దాడులకు అధికారం ఇచ్చారు. కమిటీలో వార్డు శానిటేషన్ సెక్రటరీ అధ్యక్షతన మహిళా పోలీస్, రిసోర్స్‌పర్సన్, ఎన్‌జీవో సంఘాల ప్రతినిధులను సభ్యులుగా నియమించారు. సచివాలయం పరిధిలోని దుకాణాల వద్ద క్యూఆర్ కోడ్ స్టిక్కర్ అతికిస్తున్నారు. ఆ కోడ్‌ను సెల్‌ఫోన్‌లో స్కాన్‌చేయగానే సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్ వల్ల నష్టాలు, బయోడీగ్రేడబుల్ ... మిగతా 8వ పేజీలో

స్తబ్దుగా రియల్ వ్యాపారం

అంచనాలు అందుకోలేకపోతున్న రిజిస్ట్రేషన్లు

- విశాఖలో అధిక ధరలే కారణం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

విశాఖపట్నంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం స్తబ్దుగా ఉంది. ధరలు అధికంగా ఉండడం వల్ల ధనికులు తప్ప మధ్య తరగతి ప్రజలు భూములు, ఫ్లాట్లు కొనుగోలు చేయలేకపోతున్నారు. దీంతో రిజిస్ట్రేషన్ల శాఖ ఆశించిన ఆదాయం అందుకోలేకపోతోంది. ప్రభుత్వం విశాఖ జిల్లాకు 2024-2025 ఆర్థిక సంవత్సరంలో డిసెంబరుతో ముగిసిన తొమ్మిది నెలల కాలానికి (ఏప్రిల్-డిసెంబరు) తొమ్మిది రిజిస్ట్రార్ కార్యాలయాల ద్వారా రూ.1,106.34 కోట్లు ఆదాయం లక్ష్యంగా ఇచ్చింది. అందులో 69.31 శాతం (766.82 కోట్లు) మాత్రమే వచ్చింది. ఇది గత ఏడాది (మొదటి తొమ్మిది నెలలు)తో పోల్చుకుంటే 1.2 శాతం అధికం అయినప్పటికీ ఆశించిన ప్రగతి కనిపించలేదు.

గత ప్రభుత్వం విధానాలే...



2024-25 ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకూ ఆదాయం వివరాలు

కార్యాలయం	లక్ష్యం	వచ్చిన ఆదాయం (రూ.కోట్లలో)
ఆనందపురం	రూ.65.41	రూ.45.79
భీమునిపట్నం	రూ.61.95	రూ.41.22
ద్వారకానగర్	రూ.119.63	రూ.82.85
గాజువాక	రూ.108.39	రూ.73.04
గోపాలపట్నం	రూ.58.26	రూ.39.88
మధురవాడ	రూ.241.89	రూ.189.44
పెందుర్తి	రూ.84.18	రూ.52.38
సూపర్‌బజారు	రూ.276.3	రూ.176.79
పెదగంట్యాడ	రూ.90.39	రూ.65.45

రాష్ట్రంలో అన్ని ప్రాంతాల కంటే విశాఖపట్నంలో భూముల ధరలు అధికం. గత వైసీపీ ప్రభుత్వం ఇక్కడ పరిపాలనా రాజధాని ఏర్పాటుచేస్తామని ప్రచారం చేయడం, రుషికొండపై సీఎం కార్యాలయం పేరుతో రూ.500 కోట్లతో భారీ భవనం నిర్మించడంతో శివార్లలో భూముల ధరలు, నగరంలో ఫ్లాట్ల ధరలు భారీగా పెరిగిపోయాయి. నెలకు రూ.50 వేలు జీతం తీసుకునే ఉద్యోగి కూడా ఒక ఫ్లాట్ కొనలేని పరిస్థితి ఏర్పడింది. నగరంలో ఇప్పుడు ఎక్కడైనా ఒక ఫ్లాట్ కొనాలంటే చదరపు అడుగుకు అధమంగా రూ.8 వేలు చొప్పున వేయి చ.అడుగుల ఫ్లాట్‌కు కోటి రూపాయలు పెట్టాలి. ఉద్యోగులకు రూ.25 లక్షల నుంచి రూ.30 లక్షలకు మించి బ్యాంకు రుణం రాదు. చేతి నుంచి రూ.70 లక్షలు పెట్టాలి. అందుకే చాలామంది శివార్లకు వెళుతున్నారు. అక్కడ కూడా రూ.60 లక్షల నుంచి రూ.70 లక్షలు వెచ్చించాల్సి వస్తోంది. ఇక ఇళ్ల స్థలాల ధరలు కూడా అలాగే ఉన్నాయి. ఆనందపురం, భీమిలి, పెందుర్తి, పద్మనాభం మండలాల్లో చదరపు గజం రూ.15 వేలకు తక్కువ లేదు. రహదారికి 100 మీటర్ల దూరాన ఉంటే గజం రూ.20 వేలు చెబుతున్నారు. ఇంటికి 150 గజాల స్థలం కొనాలంటే రూ.30 లక్షలు పెట్టాల్సి వస్తోంది. అయితే మార్కెట్ లేకపోయినా రియల్ ఎస్టేట్ వ్యాపారులు రేట్లు ... మిగతా 8వ పేజీలో



గిడిజాలలో నిర్మిస్తున్న ఇళ్లు

వైసీపీ సానుభూతిపరులదే హవా!

హౌసింగ్‌లో ఇప్పటికీ కొనసాగుతున్న పెత్తనం

- బడా కాంట్రాక్టర్లకే అధికారుల పెద్దపీట
- సెంటు స్థలాల లేఅవుట్‌లలో అధిక శాతం వారికే
- ఆగమేఘాలపై బిల్లుల మంజూరు
- ఇసుక సరఫరాలోనూ వారికే మొగ్గు
- యంత్రాంగం తీరుపై చిన్న కాంట్రాక్టర్ల మండిపాటు
- ప్రభుత్వానికి ఓ కాంట్రాక్టరు ఫిర్యాదు

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అండదండలతో విశాఖలో ఒక సెంటు స్థలాల లేఅవుట్‌లలో ఇళ్లు నిర్మిస్తున్న పెద్ద కాంట్రాక్టర్లకే హౌసింగ్ అధికారులు పెద్దపీట వేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. చేసిన పనులను ఎం.బుక్‌లో నమోదు, బిల్లుల మంజూరు, ఇసుక సరఫరాలోనూ వారి హవా కొనసాగుతోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో కొందరు అధికారుల పాత్రపై హౌసింగ్ కార్యాలయంలోనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో చిన్న కాంట్రాక్టర్లను పట్టించుకోవడంలేదని, ఇసుక కూడా సరఫరా చేయడంలేదని సమాచారం. బిల్లులు రాక వారంతా ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, దీంతో కడుపుమండిన ఓ కాంట్రాక్టరు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారని సమాచారం.

నగరంలో 1.3 లక్షల మంది పేదలకు శివారు ప్రాంతాల్లో సుమారు 73 లేఅవుట్‌లు అభివృద్ధి చేశారు. ఒక్కొక్కరికి సెంటు చొప్పున స్థలం కేటాయించిన ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద రూ.1.5 లక్షలతోపాటు రాష్ట్రం రూ.30 వేలు వెరసి రూ.1.8 లక్షలతో ఇళ్ల నిర్మాణానికి నిర్ణయించింది. లబ్ధిదారుడే ఇల్లు నిర్మించుకోవాలని షరతు విధించింది. నగరానికి దూరంగా లేఅవుట్‌లు ... మిగతా 8వ పేజీలో

ఆశాజనకం

జీవీఎంసీలో జోరుగా ఆస్తి పన్ను వసూళ్లు

- 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ.459 కోట్లు లక్ష్యం
- ఇప్పటివరకు రూ.295 కోట్లు వసూలు
- గత ఏడాదితో పోల్చితే రూ.31 కోట్లు అధికం



(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

జీవీఎంసీ పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లు ఆశాజనకంగా ఉన్నాయి. గత ఏడాదితో పోల్చితే ఇప్పటికే రూ.31 కోట్లు అధికంగా వసూలవడం రెవెన్యూ సిబ్బందికి కొత్త ఉత్సాహాన్ని ఇస్తోంది. మార్చి నెలాఖరుకు మిగిలిన రూ.169 కోట్లు వసూలు చేసి శత శాతం లక్ష్యం సాధించాలని కార్యాచరణ రూపొందిస్తున్నారు.

జీవీఎంసీకి ప్రధాన ఆదాయవనరు రెవెన్యూ విభాగం. ఆస్తిపన్ను వసూలు ద్వారా సమకూరిన ఆదాయాన్ని నగరంలో అభివృద్ధి పనులకు, పారిశుధ్య నిర్వహణకు ఖర్చు చేయాల్సి వుంటుంది. ఈ వసూళ్లు నిలిచిపోతే ఆ ప్రభావం నగరంపై తీవ్రంగా పడుతుంది. దీంతో జీవీఎంసీ కమిషనర్‌గా ఎవరున్నా ఆస్తిపన్ను వసూళ్లపైనే ప్రధానంగా దృష్టిసారిస్తారు. ఈ వసూళ్లు సక్రమంగా జరిగేలా ఎప్పటికప్పుడు రెవెన్యూ విభాగం అధికారులు, సిబ్బందికి దిశానిర్దేశం చేస్తుంటారు.

నగరంలో అసెస్‌మెంట్లు ఇవీ

జీవీఎంసీ పరిధిలో 6,13,197 అసెస్‌మెంట్లున్నాయి. వీటిలో ప్రైవేటు వ్యక్తులకు చెందినవి 5,72,002 కాగా రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించినవి 1,623, కేంద్ర ప్రభుత్వ రంగానివి 518 ఉన్నాయి. ఇవికాకుండా ఖాళీ స్థలాలకు సంబంధించిన 38,154 అసెస్‌మెంట్‌లు ఉన్నాయి. వీటి ద్వారా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.459 కోట్లు ఆస్తిపన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఇప్పటివరకు (జనవరి 12 నాటికి) 295 కోట్లు వసూలయింది. అదే గత ఆర్థిక సంవత్సరంలో జనవరి 15 నాటికి రూ.264 కోట్లు మాత్రమే ... మిగతా 8వ పేజీలో

కేజీహెచ్‌లో మరో రెండు డయాలసిస్ సెంటర్లు

భావననగర్, రాజేంద్రప్రసాద్ వార్డుల్లో ఏర్పాటుకు చర్యలు

- తొలి విడత పది పడకలతో ప్రతిపాదనలు
- రూ.60 లక్షలు ఖర్చవుతుందని అంచనా
- ప్రస్తుతం నెఫ్రాలజీ, నెఫ్రోప్లస్ విభాగాల్లో సేవలు



డయాలసిస్ సేవలు అందుబాటులోకి రానున్న రాజేంద్రప్రసాద్ వార్డు

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కింగ్‌జార్జ్ ఆస్పత్రిలోని రెండు వార్డుల్లో డయాలసిస్ సెంటర్లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతు న్నారు. ఈ మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఆస్పత్రిలోని భావననగర్, రాజేంద్రప్రసాద్ వార్డుల్లో వీటిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. ఈ వార్డుల్లో వివిధ అనారోగ్య సమస్యలతో ప్రతిరోజూ పదులసంఖ్యలో రోగులు చేరు తుంటారు. వీరిలో చాలామందికి డయాలసిస్ అవసర మవుతుంటుంది. ఈ సేవలు అందించేందుకు రోగులను సూపర్‌స్పెషాలిటీ బ్లాక్‌లోని నెఫ్రాలజీ విభాగంలో ఉన్న డయాలసిస్ యూనిట్‌కు తరలించాల్సి వస్తోంది. ఈ క్రమంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. కొన్ని సార్లు రోగి ప్రాణాలకు ముప్పు ఏర్పడుతోంది. ఈ ఇబ్బందులను గుర్తించిన అధికారులు అత్యవసరమైన చోట్ల డయాలసిస్ చేసే సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా భావననగర్, రాజేంద్ర ప్రసాద్ వార్డుల్లో డయాలసిస్ సేవలు అందుబాటులోకి తీసుకురావాలని భావించారు. ఇందులో భాగంగా తొలి విడత పది పడకలను అందుబాటులోకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకోసం నాలుగు డయాలసిస్ యంత్రాలు, ఇతర పరికరాలు కొనుగోలు చేయాలని ప్రతిపాదించారు. ఇందుకు ఆస్పత్రి అభివృద్ధి నిధులను వినియోగించేందుకు ... మిగతా 8వ పేజీలో


సినిమాలో నటించిన వెంకట్

గేమ్ ఛేంజర్ సినిమాలో మంగమారిపేట వాసి

భీమునిపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటించిన గేమ్ ఛేంజర్ సినిమాలో మంగమారిపేటకు చెందిన చింతలపూడి వెంకట్ నటించారు. మంగమారిపేట వారిజ ఆశ్రమం నేత్రవిద్యాలయంలో ఆయన కరాటే కోచ్‌గా పని చేస్తున్నారు. గేమ్ ఛేంజర్ సినిమాలో హీరో రామ్‌చరణ్ గుడ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, బ్యాడ్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులతో సమావేశమవుతారు. ఆ సన్నివేశంలో బ్యాడ్ ఐఏఎస్ అధికారిగా వెంకట్ కనిపించారు. అలాగే ఎస్పీ సూర్యతో కలిసి ఒక సన్నివేశంలో ఉన్నారు. దీంతో భీమిలిలో ఆయన పరిచయస్తులు, తెలిసిన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సన్నివేశాల కోసం వెంకట్ మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన షూటింగ్‌లో పాల్గొన్నారు.

విద్యుత్ అదనపు చార్జీలు రద్దు చేయాలి : సీపీఎం

మధురవాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రజలపై అదనపు విద్యుత్ బిల్లుల భారం వేయొద్దని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం వారు ఆ పార్టీ జిల్లా కమిటీ సభ్యుడు డి. అప్పలరాజు ఆధ్వర్యంలో కొమ్మాది, పరదేశిపాలెం, మారికవలస, పోర్టు కాలనీ ప్రాంతాల్లోని భోగీ మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బడా పారిశ్రామికవేత్తల మనుగడ కోసం ప్రభుత్వం ట్రూ అప్ చార్జీలు, ఎఫ్‌పీపీసీఏ-1, 2 చార్జీలను ప్రజలపై వేస్తుందని ఆరోపించారు. పెంచిన చార్జీలు సామాన్యులకు భారంగా ఉన్నాయని,వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పి.రాజ్‌కుమార్, బి. భారతి, పవన్, సియ్యాద్రి పైడితల్లి, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

బస్ షెల్టర్లు లేక అవస్థలు

తగరపువలస, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తగరపువలసలో జాతీయ రహదారిపై బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు.సిటీ బస్సులు మినహా ఎక్స్‌ప్రెస్ బస్సులన్నీ వంతెనపై నుంచి రాకపోకలు సాగిస్తున్నాయి. విజయనగరం వెళ్లేవారు తగరపువలస వంతెన వద్ద విశాఖ వెళ్లేవారు సంగివలస వద్ద బస్సుల కోసం వేచి ఉంటున్నారు. ఈ రెండుచోట్ల బస్సులకు స్టేజీలు ఉన్నాయి. కానీ ఆయా ప్రాంతాల్లో షెల్టర్లు లేకపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. ఎండైనా, వానైనా ఆరు బయట పడిగాపులు పడుతున్నారు. షెల్టర్లు లేకపోవడంతో కొన్ని బస్సులు ఆగడం లేదు.పాలకులు, అధికారులు స్పందించి ఈ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కోడి పందేల నిరోధానికి డ్రోన్ కెమెరాతో నిఘా

పద్మనాభం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పద్మనాభం పోలీసులు స్టేషన్ పరిధిలో కోడి పందాలతో పాటు ఇతర అసాంఘిక కార్యకలాపాల నిరోధానికి డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టి తనిఖీలు ముమ్మరం చేశారు. సీపీ ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరా ద్వారా పొట్నూరు, గంధవరం, బాందేవుపురం, సామయ్యవలస, రౌతులపాలెం గ్రామాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. పండగ రెండు రోజులు కోడి పందాలు, జూదాలు ఆడకుండా నిరోధించడానికి పటిష్ట నిఘా ఏర్పాటు చేశారు. పండగ పూర్తయ్యే వరకు ఈ నిఘాను కొనసాగించనున్నట్టు పోలీసులు చెప్పారు.

నేడు ముగ్గుల పోటీ

భీమునిపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పురస్కరించుకుని బీచ్‌రోడ్‌లో ఉన్న పోలమాంబ ఆలయం వద్ద మహిళలకు మంగళవారం ముగ్గుల పోటీ నిర్వహించనున్నట్టు టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు తెలిపారు. సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మొదటి బహుమతి కింద రూ. 5 వేలు, ద్వియతీ బహుమతిగా రూ. 3 వేలు, తృతీయ బహుమతిగా రూ. 2 వేలు, నాలుగు, ఐదవ బహుమతిగా రూ. వెయ్యి చొప్పున అందిస్తామన్నారు. అలాగే గ్రామాభివృద్ధి వేదికపై ఉదయం నుంచి సాయంత్రం వరకూ మూగి సుధాదాసు భక్తి గీతాలాపన జరుగుతుందన్నారు. 15న సాయంత్రం కనకదుర్గ బుర్ర కథ ప్రదర్శించనున్నట్టు ఆయన చెప్పారు.

నేడు పతంగుల ఎగరవేత

భీమునిపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గోస్తనీ సాగర తీరంలో మంగళవారం పతంగుల ఎగరవేత పోటీ నిర్వహించనున్నారు. ఈమేరకు ఫ్రెండ్స్ అసోసియేషన్, ప్రెస్ క్లబ్ సభ్యులు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు.ఉదయం ఎనిమిది గంటలకు బీచ్‌లో సాగర తీరం ప్రవేశద్వారం వద్ద ఈ పోటీలు జరుగుతాయన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

సింహాచలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పురస్కరించుకుని 98వ వార్డులోని పేదలకు కర్రి అప్పలస్వామి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు అప్పలస్వామి, సత్తిబాబు, రాజ్ నందా, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


పద్మనాభం : కృష్ణాపురంలో భోగి మంట వద్ద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు


భీమిలిలో పలు వేషధారణలతో స్వచ్ఛంద సంస్థల సభ్యులు

వీధి వీధినా భోగి మంటలు

- గ్రామాల్లో వేడుకగా పండుగ
- కృష్ణాపురంలో సంప్రదాయ దుస్తులతో అలరించిన ప్రభుత్వ ఉద్యోగులు


భీమునిపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లోనూ భోగి పండుగ సోమవారం ఘనంగా జరిగింది. భీమిలి పట్టణంలో బీచ్‌రోడ్ పైలాన్ వద్ద ఫ్రెండ్స్ అసోసియేషన్, ప్రెస్ క్లబ్, పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సామూహిక భోగి మంట వేశారు. ఈ సందర్భంగా పట్టణ పురోహితుడు నుసరాపు కామేశ్వర మాధవ శాస్త్రి భోగి విశిష్టతను తెలియజేశారు. అనంతరం హరిదాసు హడావిడి,గంగిరెద్దుల విన్యాసాలు, పిట్టల దొర కబుర్లతో పల్లె వాతావరణం, హిందూ సంప్రదాయం కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. భోగి మంట చుట్టూ మహిళలు, యువత ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ ఆనందోత్సాహాలతో ప్రదక్షిణలు చేశారు. ఈ కార్యక్రమంలో హిందూ పరిరక్షణ సమితి కన్వీనర్ మైలపల్లి షణ్ముఖరావు, నాయకులు గంటా నూకరాజు, అల్లిపిల్లి నరసింగరావు, సీనియర్ సిటిజన్ పులవర్తి రాము, మహిళా సిటిజన్ ఉసిరికల చంద్రావతి, ఫ్యాబ్, ప్రెస్‌క్లబ్, బీచ్ సీనియరు సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు, సాగర్ అసోసియేషన్ ఆఫ్ వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

మధురవాడ : మధురవాడ పరిసరాల్లో భోగి ఉత్సాహంగా జరిగింది. మధురవాడ, పీఎంపాలెం, మిథిలాపురి వుడాకాలనీ, నగరంపాలెం, కొమ్మాది, స్వతంత్రనగర్ కాలనీ, అయోధ్యనగర్ ప్రాంతాల్లో వీధివీధినా మంటలు వేశారు. నగరంపాలెం, మిథిలాపురి ఉడాకాలనీ, పీఎంపాలెం, బక్కన్నపాలెం ప్రాంతాల్లోని వెంకటేశ్వరాలయాల్లో భోగి సందర్భంగా గోదాదేవి కల్యాణాలు ఘనంగా జరిపించారు.

సాగర్‌నగర్ : సాగర్‌నగర్, రుషికొండ, గుడ్లవానిపాలెంలోనూ భోగి ఘనంగా నిర్వహించారు. సాగర్ నగర్ యూ త్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీ నిర్వహిం చారు. విజేతలకు అసోసియేషన్ సభ్యులు, కూటమి నాయకులు బహుమతులు అందించారు. అంత కముందు అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు కూడలిలో భోగి మంట వేశారు. గుడ్లవానిపాలెం, రుషికొండలోనూ భోగి ఘనంగా జరిపారు.


సాగర్‌నగర్ కూడలిలో వేసిన భోగి మంట

పద్మనాభం : కృష్ణాపురం గ్రామంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కుటుంబ సమేతంగా సంప్రదాయ వస్త్రాలు ధరించి, భోగి మంట వేశారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీ, చిన్నారులకు పలు ఆటల పోటీలు నిర్వహించారు. మద్ది, పాండ్రంగి, రేవిడి, కోరాడ, అయినాడ, విలాస్‌ఖాన్‌పాలెం, నేరేళ్లవలస గ్రామాల్లోనూ భోగి ఉత్సాహంగా చేసుకున్నారు.


భీమిలిలో లక్ష్మీనృసింహస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు


భీమిలిలో కల్యాణ వెంకటేశ్వరస్వామి


ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా కల్యాణం

వైభవంగా గోదా, రంగనాథుల కల్యాణం

భీమునిపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలోని అన్ని ఆలయాల్లోనూ గోదా, రంగనాథుల కల్యాణం సోమవారం వైభవంగా నిర్వహించారు. భీమిలి పట్టణంలోని లక్ష్మీ నరసింహ స్వామి ఆలయానికి తెల్లవారుజామున నాలుగున్నర గంటల నుంచే భక్తులు పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లు మెట్ల మార్గం వరకూ బారులు తీరాయి. ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీసులు ఉదయం 5 గంటల నుంచే డైట్ కళాశాల జంక్షన్‌లో వాహనాలను నిలిపివేశారు. అలాగే తగరపువలస రహదారిలో గొల్లవీధి ముందు ఏబీ చర్చి జంక్షన్‌లో వాహనాల రాకపోకలను నిలిపివేసారు. అక్కడి నుంచి భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చారు. తెల్లవారుజామునుంచి మధ్యాహ్నం వరకూ రద్దీ కొనసాగింది. ట్రాఫిక్ సమస్య లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు. ఆలయ వంశపారంపర్య అర్చకులు రొంపిచెర్ల సింగరాచార్యులు,లక్ష్మీనృసింహప్రసాదాచార్యులు, కృష్ణమాచార్యులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి, భక్తులకు దర్శనాలు కల్పించారు. కృష్ణాకాలనీ వెంకటగిరిలో ఉన్న పద్మావతి, గోదా సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలోను, ఐశ్వర్య వెంకటేశ్వరస్వామి ఆలయంలోను, వారిజ ఆశ్రమంలో శ్రీలక్ష్మీ హయగ్రీవ మందిరంలోనూ గోదా రంగనాథుల కల్యాణం వైబవంగా నిర్వహించారు. ఆయా ఆలయాల ప్రధానార్చకులు అప్పలాచార్యులు, శేషాచార్యులు, శ్రీకాంత్ శర్మ పర్యవేక్షణలో కల్యాణాలు నిర్వహించారు.


పద్మనాభంలో గోదా రంగనాథుల కల్యాణం

అనంతుని క్షేత్రంలో...

పద్మనాభం : పద్మనాభంలోని అనంత పద్మనాభుడి క్షేత్రంలో ధనుర్మాసోత్సవాల ముగింపులో భాగంగా సోమవారం గోదా కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఏటా భోగి రోజున నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా వేకువ జామున గోదా రంగనాథులకు ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించిన అనంతరం స్వామివారు, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను పల్లకీపై ఆలయ ప్రాకారం చుట్టూ ఊరేగించి బేడా ఉత్సవం చేశారు. ఉభయ దేవేరులతో కూడిన రంగనాథుల వారు గోదాదేవి ఉత్సవ విగ్రహాలను పల్లకీపై గ్రామ తిరువీధుల్లో ఊరేగింపుగా తీసుకువెళ్లి, గోస్తనీ నదిలో నీలాటోత్సవం నిర్వహించారు. అక్కడి నుంచి విగ్రహాలను తోడ్కొని వచ్చి కుంతీమాధవస్వామి ఆలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మండపంపై నిలిపారు. అనంతరం ఆలయ అర్చకులు సీతారామాంజనేయస్వామి, వెంకటాచారి, పవన్ ఆధ్వర్యంలో గోదా రంగనాథుల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కె. రాంబాబు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు కె. నగేశ్‌కుమార్, ఈఓ నానాజీబాబు, సర్పంచ్ టి. పాప పద్దు, టీడీపీ నాయకులు ఎర్నాయుడు, ఆనందబాబు, పైడిరాజు, సన్నిబాబు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు. కాగా స్వామివారిని కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రిన్సిపాల్ గ్రూప్ కెప్టెన్ ఎస్ఎస్ శాస్త్రి దర్శించుకున్నారు. ఈఓ నానాజీబాబు ఆయనకు ఆలయ విశేషా లను వివరించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. స్వామివారి చిత్రపటాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు తాలాడ పైడిరాజు, బుగత రాము, తదితరులు పాల్గొన్నారు.

సింహాచలం : సింహగిరి కొండ దిగువ పూదోటలోని పద్మావతి, అలిమేల్‌మంగా సమేత వేంకటేశ్వస్వామి సన్నిధిలో సోమవారం జరిగిన గోదా రంగనాథుల కల్యాణంతో ధనుర్మాసోత్సవాలు పరిసమాప్తమయ్యాయి. ప్రభాతారాధనలు తరువాత ఉత్సవమూర్తులను శోభాయమానంగా తీర్చిదిద్ది ప్రత్యేక వేదికపై అధిష్టింపజేశారు. షోడపశోపచారాలుతో పూజలు చేసిన తరువాత తిరుప్పావైలోని 29, 30వ పాశురాలను విన్నపాలు జరిపారు. తరువాత ముందుగా దేవస్థానం నిర్ణయించిన రుసుము చెల్లించి పాల్గొన్న ఉభయ దాతల గోత్రనామాలతో సంకల్పించి దేవస్థానం ప్రధానార్చకుడు ఐవీ రమణాచార్యులు ఆధ్వర్యంలో గోదా రంగనాథుల కల్యాణం జరిపారు.అనంతరం భక్తులకు కల్యాణ అక్షితలు, వేదాశీర్వచనాలు, శేషవస్త్రాలు, ప్రసాదాలను అందజేశారు.


సింహాచలం : కల్యాణోత్సవంలో భాగంగా దండలు మార్పును ప్రదర్శిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

నగరం... నిర్మానుష్యం

... 7వ పేజీ తరువాయి

చెందినవారే. ఏడాదంతా ఉద్యోగం, వ్యాపారం ఇతర వ్యాపకాల్లో బిజీగా గడిపినవారంతా సంక్రాంతికి స్వస్థలాలకు వెళ్లి సంక్రాంతిని జరుపుకోవడానికి ఆసక్తిచూపుతారు. విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11 నుంచి 19 వరకూ సెలవులు ప్రకటించింది. దీంతో చాలామంది ఈనెల 11 నుంచే ప్రయాణాలు పెట్టుకున్నారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారు, వ్యాపారులు, స్వయం ఉపాధి చేసుకునేవారు, కూలిపనులు చేసుకునేవారు మాత్రం ముందుగా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఆది, సోమవారాల్లో స్వస్థలాలకు పయనమయ్యారు. మిగిలిపోయినవారు భోగి పండగను సోమవారం నగరంలోనే జరుపుకుని బయలుదేరారు. దీనివల్ల మధ్యాహ్నం 12 గంటల వరకు అనకాపల్లి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే మార్గాలపై వాహనాల రద్దీ కనిపించినా తర్వాత పూర్తిగా తగ్గిపోయింది. నిత్యం వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌తో పద్మవ్యూహాన్ని తలపించే హనుమంతవాక కూడలి, వెంకోజీపాలెం, ఇసుకతోట, ఎంవీపీకాలనీ, సత్యం జంక్షన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్, గాజువాక వంటి ప్రధాన కూడళ్లు రద్దీ లేకపోవడంతో కళా విహీనంగా మారాయి. ద్వారకనగర్, ఆశీల్‌మెట్ట నుంచి జగదాంబ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్‌నుంచి డాబా గార్డెన్స్ రోడ్డులో వాహనాల రాకపోకలు తగ్గిపోయాయి. నగరంలో ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటలు వరకూ విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. ఒక్కో కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ పడితే వాహనాలు కిలోమీటరు పొడవునా బారులుతీరిపోతాయి. కానీ సోమవారం నగరంలో పరిస్థితి దీనికి పూర్తివిరుద్ధంగా కనిపించింది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్‌సిగ్నల్‌పడినా పదిలోపు వాహనాలు మాత్రమే ఆగిఉంటున్నాయి. సాధారణంగా సెలవురోజుల్లో కోలాహలంగా కనిపించే బీచ్, జూపార్క్ సందర్శకుల తాకిడిలేకపోవడంతో ఖాళీగా కనిపించాయి. తప్పనిసరిపరిస్థితిలో నగరంలోనే పండగ జరుపుకునేందుకు ఉండిపోయినవారు మాత్రం బీచ్‌కు వెళ్లి గాలిపటాలు ఎగరవేస్తూ కాలక్షేపం చేశారు. రాత్రికాగానే వారంతా తిరిగి ఇళ్లకు చేరిపోవడంతో బీచ్ నిర్మానుష్యంగా మారిపోయింది. ఊరెళ్లినవారంతా సంక్రాంతి, కనుమ పండగలను స్వస్థల్లాలో జరుపుకున్న తర్వాతే తిరిగి వస్తారు కాబట్టి అంతవరకూ నగరంలో ఇదే పరిస్థితి కొనసాగుతుందని అంచనా.

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ. లక్ష విరాళం

సింహాచలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మధురవాడకు చెందిన మరుపిల్లి శ్రీనుబాబు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. విరాళం మొత్తం రూ.1,01,116లను దాత నగదు రూపంలో అన్నప్రసాద విభాగం ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావుకు ఆదివారం అందజేశారు. ఆలయం ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

కేజీహెచ్‌లో మరో రెండు డయాలసిస్ సెంటర్లు

... 7వ పేజీ తరువాయి

సిద్ధమవుతున్నారు. కొద్దిరోజుల్లోనే ఈ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు.

ప్రతి రోజూ 50 మందికి సేవలు..

ప్రస్తుతం కేజీహెచ్‌లో ప్రతిరోజూ 50 మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. నెఫ్రాలజీ విభాగంలోని పది డయాలసిస్ యంత్రాలతో ఉన్న సెంటర్‌లో ప్రతిరోజూ 20 మందికి సేవలు అందుతుండగా, సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోనే నెఫ్రోప్లస్ అనే సంస్థ ద్వారా ప్రత్యేకంగా రోజుకు 30 మదికి డయాలసిస్ సేవలందిస్తున్నారు. నెఫ్రోప్లస్‌లో అందించే సేవలకు ఓపీ విధానంలో రోగులు డయాలసిస్ చేయించుకుని వెళ్తుంటారు. కాగా వార్డులో ఇన్‌పేషెంట్లు, ఇతర విభాగాల నుంచి వచ్చే వారికి సేవలందిస్తారు. ఇతర విభాగాల్లో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులను ఇక్కడకు తీసుకువచ్చి సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన అధికారులు ప్రత్యామ్నాయంగా ఈ రెండు వార్డుల్లో డయాలసిస్ సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

స్తబ్ధుగా రియల్ వ్యాపారం

... 7వ పేజీ తరువాయి

తగ్గించడం లేదు. ఈరోజు కాకపోతే రేపు అమ్ముకున్నా మంచి ధర వస్తుందని వేచి చూస్తున్నారు. దీంతో లావాదేవీలు పెద్దగా జరగడం లేదు.

అరకొరగా ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు

చాలామంది విశాఖలో ఫ్లాటు కొనాలంటే...సొంత ఊళ్లోనో.. మరోచోటో ఉన్న స్థిరాస్తిని అమ్మి, ఆ మొత్తానికి మరికొంత బ్యాంకు రుణం జోడించాల్సి వస్తోంది. అలా ఒకటీ అరా ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కృత్రిమ డిమాండ్ వల్ల రేట్లు పెరిగిపోయాయి. ఒకసారి పెంచితే తగ్గించే అలవాటు లేకపోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి వచ్చింది.

- జి.బాలకృష్ణ, డీఐజీ, రిజిస్ట్రేషన్ల శాఖ

సాగర దుర్గమ్మకు పూజలు

పద్మనాభం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మద్ది గ్రామంలో ఉన్న సాగర దుర్గమ్మ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ బుగత సత్యనారాయణ, సర్పంచ్ సన్యాసమ్మ ఆధ్వర్యంలో పురోహితులు సామవేదం సీతారాం అమ్మవారికి అర్చనలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సానుభూతిపరులదే హవా!

... 7వ పేజీ తరువాయి

ఉండడంతో లబ్ధిదారులు నిర్మాణానికి ముందుకు రాలేదు. దీంతో హౌసింగ్ కార్పొరేషన్ ప్రమేయంతో అనధికారికంగా పలువురు కాంట్రాక్టర్లకు నిర్మాణాల బాధ్యత అప్పగించారు. దీంతో ప్రధానంగా నెల్లూరు, అనంతపురం జిల్లాలకు చెందిన వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లే ఎక్కువ పనులు తీసుకున్నారు. వీరికి హౌసింగ్ అధికారులు అధిక ప్రాధాన్యతనిస్తూ రెడ్‌కార్పెట్ పరిచారు. మెటీరియల్ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చి, బిల్లుల మంజూరు ఆగమేఘాలపై ఫైళ్లు కదిపారు. ఇంతచేసినా గత ప్రభుత్వంలో అనంతపురంలోని ఓ వైసీపీ ఎమ్మెల్యేకి చెందిన రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థ ఇళ్ల నిర్మాణంలో చతికిలబడింది. అయినప్పటికీ ఈ సంస్థకు అధికంగా బిల్లులు చేసిన అధికారులు వైసీపీపై భక్తిభావం చాటుకున్నారు.

ప్రభుత్వం మారినా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైసీపీ మద్దతుదారులైన కాంట్రాక్టర్ల హవా కొనసాగుతోంది. వారు చెప్పిందే హౌసింగ్ కార్యాలయంలో జరుగుతోందనే వాదన ఉంది. అధికారులు వారికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ చిన్న కాంట్రాక్టర్లను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా పనులు చేపట్టాలని నాలుగు నెలల కొందట ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కాంట్రాక్టర్లు నిర్మాణాలు ప్రారంభించారు. పనులుచేసిన వెంటనే ఎం.బుక్‌లో వివరాలు నమోదు చేయడంలో పెద్ద కాంట్రాక్టర్లకే అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. బిల్లులు మంజూరు చేయడంలోనూ ఆగమేఘాల మీద పనిచేస్తున్నారు. వారు కోరిన మేరకు ఇసుక సరఫరా చేస్తున్న అధికారులు, చిన్న కాంట్రాక్టర్లను పక్కన పెట్టేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఓ కాంట్రాక్టరు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారని తెలిసింది. తన పేరు బయటకు వస్తే వేధింపులకు దిగుతారనే అనుమానంతో వివరాలు చెప్పడానికి వెనుకాడారు.

ఇప్పటికీ వైసీపీ సేవలోనే...

జిల్లా హౌసింగ్ కార్యాలయంలో గతంలో పనిచేసిన ఉన్నతాధికారి నెల్లూరు కాంట్రాక్టర్లకు అనుకూలంగా ఉండేవారని, ఇందుకు గాను ఓ కారు బహుమతిగా అందుకున్నారని సిబ్బందే గుసగుసలాడుతున్నారు. ఆ తరువాత వచ్చిన అధికారులు కూడా వైసీపీ అనుకూలరుకే పనిచేసి పెడుతున్నారని చెబుతున్నారు. తాజాగా పెద్ద కాంట్రాక్టర్లకు సరఫరా చేసిన ఇసుక నుంచి కొన్ని లారీలను పక్కదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆశాజనకం

... 7వ పేజీ తరువాయి

వసూలైంది. గత ఏడాదితో పోల్చితే ఈ సారి రూ.31 కోట్లు అధికంగా వసూలు చేయడంతో మిగిలిన రూ.169 కోట్ల వసూలుకు కార్యాచరణ రూపొందించుకుని అమలుచేస్తున్నారు.

బకాయిలపైనా ప్రత్యేక దృష్టి

నగర పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లతోపాటు కోర్టు కేసులపేరుతో పెండింగ్‌లో ఉండిపోయిన బకాయిల వసూళ్లపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. కోర్టులో కేసులు వేసినవారితో స్వయంగా మాట్లాడుతున్నారు. లేదంటే రెవెన్యూ అధికారులను పంపి చర్చలు జరిపిస్తున్నారు. ఈ సందర్భంగా కేసు విత్‌డ్రా చేసుకునేలా ఒప్పిస్తున్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న సంస్థల నుంచి పెండింగ్ బకాయిలను రాబట్టేలా ఆయాశాఖల ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నారు. దీనివల్ల పెండింగ్ బకాయిలు కూడా జీవీఎంసీ ఖాతాకు జమవుతున్నాయి. మరోవైపు ప్రతి వారం రెవెన్యూ విభాగంపై సమీక్షలు నిర్వహించి జోన్‌లవారీగా పన్ను వసూళ్లపై ఆరాతీస్తున్నారు.మరోవైపు కమిషనర్ ఆదేశాలతో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు ప్రతిరోజూ ఏదో ఒక జోన్‌లో భారీమొత్తంలో ఆస్తిపన్ను బకాయి ఉన్న అసెస్‌మెంట్‌లకు వెళ్లి అధికారులు/ ప్రైవేటు ఆస్తి యజమానులతో మాట్లాడి పన్ను చెల్లించేలా ఒప్పించడం, అసెస్‌మెంట్‌ల వారీగా తనిఖీలు చేస్తున్నారు. ఎవరికైనా అసెస్‌మెట్ జారీచేయకపోయినా, జాప్యం జరిగినా సంబంధిత వార్డు టాక్స్‌కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను నిలదీయడంతోపాటు చర్యలకు కమిషనర్‌కు సిఫార్సు చేస్తున్నారు. దీంతో పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో పెరిగాయని ఆ విభాగం సిబ్బంది చెబుతున్నారు.

సంబరంగా భోగి

... 7వ పేజీ తరువాయి

భోగి మంట వేశారు. బీచ్‌రోడ్డులో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో దేశీయగోవు పేడతో తయారుచేసిన లక్ష పిడకలతో బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ ఎదుట భోగిమంట వేశారు. కాగా తారురోడ్లపై భోగి మంటలు వేయవద్దని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ చేసిన విజ్ఞప్తిని ప్రజలు పట్టించుకోకుండా రహదారులపైనే మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జీవీఎంసీ యుద్ధం

... 7వ పేజీ తరువాయి

ప్లాస్టిక్ ఎక్కడ అందుబాటులో ఉందో సమాచారం స్క్రీన్‌పై కనబడుతుంది. సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగదారులకు అందజేసినా వీధివ్యాపారులకైతే మొదటిసారి రూ.2,500, రెండోసారి పట్టుబడితే రూ.ఐదు వేలు జరిమానా విధిస్తామని, మూడోసారి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదుచేసే అవకాశాలను పరిశీలిస్తామని హెచ్చరించారు. దుకాణాలు, వ్యాపారసంస్థలు సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్‌ను వాడుతూ మొదటిసారి పట్టుబడితే రూ.25వేలు, రెండోసారి పట్టుబడితే రూ.40వేలు జరిమానా. మూడోసారి పట్టుబడితే ట్రేడ్‌లైసెన్స్ రద్దుచేసి వారి కుటుంబంలో మరెవరికీ లైసెన్స్ ఇవ్వకుండా నిషేధం విధిస్తామని కమిషనర్ ప్రకటించారు. అయితే మరో నెలరోజులపాటు అవగాహన కల్పించడం, దుకాణాలపై దాడులు చేసి సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్ ఉంటే సీజ్‌చేయడంతో సరిపెట్టాలని వెసులుబాటు కల్పించారు. ఫిబ్రవరి ఒకటి నుంచి జరిమానా విధిస్తామన్నారు. దీంతో ప్రత్యేక బృందాలు ఇప్పటివరకు సుమారు 500 దుకాణాలపై దాడులు చేసి ఆరు టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్‌చేసినట్టు కమిషనర్ తెలిపారు.

వాడవాడలా ఆనందాల భోగి

» ఎటుచూసినా కోలాహలం » వేకువనే భోగిమంట వద్దకు కుటుంబాలతో విచ్చేసి సందడి
» ఏయూ మైదానంలో మిన్నంటిన సంబరాలు » ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ దంపతులు హాజరు


పాత వెంకోజీపాలెంలో భోగి మంట కాగుతున్న పిల్లలు, పెద్దలు


ఏయూ మైదానంలోని భోగి వేడుకల్లో ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ దంపతులు, రాజ్యసభ మాజీ సభ్యులు జీవీఎల్

మద్దిపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగి పండుగను నగరవాసులు సోమవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ 22, 23 వార్డుల్లో మరింత కోలాహల వాతావరణం నెలకొంది. వీధివీధిన యువత భోగి మంట వేశారు. అంతానే వేకువనే నిద్రలేచి, తలంటుపోసుకుని కొత్తబట్టలు ధరించి కుటుంబాలతో సహా భోగి మంట వద్దకు విచ్చేశారు. పిల్లల కేరింతల నడుమ ఈ వేడుక మిన్నంటింది. కొందరు పిల్లలకు భోగిపండ్లు పోశారు. ఇదిలావుంటే, ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో జీవీఎల్ మకర సంక్రాంతి వేడుకల్లో భాగంగా భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు జీవీఎల్ నరసింహారావు దంపతులు పూజలు చేసి భోగి మంట వెలిగించారు. ఈ వేడుకకు ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోగి పండుగ విశిష్టతను వివరించారు. ఇలాంటి వేడుకలు నిర్వహించడం ద్వారా మన సం స్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించినవారమవుతామన్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం : భోగి పండుగను ఈ ప్రాంత ప్రజలు వాడవాడలా ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. అంతా వేకువజామునే లేచి నలుగు పిండి పెట్టుకుని, తలంటు పోసుకున్నారు. చిన్నపిల్లలకు ఒంటిపై తెల్లజిల్లేడు ఆకు ఉంచి, దానిపై రేగిపండ్లు పెట్టి స్నానాలు చేయించారు. అనంతరం అంతా నూతన వస్త్రాలు ధరించి భోగి మంట వద్దకు విచ్చేశారు. ఇళ్ల ముందు వేసిన ముగ్గులపై గొబ్బెమ్మలను పెట్టి వాటి చుట్టూ ముత్తైదువులు ప్రదక్షిణలు చేశారు. సంక్రాంతి పండుగ పాటలను పాడుకుంటూ సరదాగా గడిపారు.

ఆరిలోవలో...

ఆరిలోవ : భోగి పండుగను ఆరిలోవ పరిసర ప్రాంత ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. అంతా వేకువనే నిద్రలేచి తలంటు పోసుకుని, ఇళ్ల ముంగిట వేసిన భోగి మంట వద్దకు విచ్చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

రామ్‌నగర్‌లో

రామ్‌నగర్: రామ్‌నగర్‌లో భోగి పండుగను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌నగర్‌లో యువత భోగీ మంటలు వేసి ఆనందంతో కేరింతలు కొట్టారు. రోడ్లపై రంగురంగుల ముగ్గులు వేసి, వాటిపై గొబ్బెమ్మలు పెట్టి, చెరుకు గడలను అమర్చారు. రంగుల దీపాలు వెలిగించి పాటలు వినిపిస్తూ, బాణసంచా కాల్చారు. అనంతరం భోగీ మంట వేశారు. రామ్‌నగర్ వాసులు ఆబాలగోపాలం అక్కడకు చేరుకొని ఉత్సాహంగా గడిపారు.


రామ్‌నగర్‌లో భోగీ మంట



పాత డెయిరీ ఫారం సమీపంలో లక్ష్మీనారాయణ ఆలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్త జనం

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం

» ఘనంగా ముగిసిన ధనుర్మాసోత్సవాలు » అమ్మవారికి విశేష పూజలు » చివరి రోజుల ఆలయాలకు పోటెత్తిన భక్తులు

వెంకోజీపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాలను అంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా చివరి రోజైన సోమవారం గోదాదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ వేడుకను మరింత ఘనంగా జరిపారు. అర్చకులు వెంకటరమణాచార్య, గోపాల్ కృష్ణ, వంశీకృష్ణ తొలుత అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు దంపతులతో కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా వారు వేడుక విశిష్టతను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించారు. ఆలయ కార్యదర్శి డాక్టర్ ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజర్ బి.సన్యాసిరావు, శివరామ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ఎంఎంటీసీ కాలనీలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో కన్నుల వేడుకగా కల్యాణోత్సవం

కొత్త వెంకోజీపాలెంలో...

కొత్త వెంకోజీపాలెంలోని కోదండ రామాలయంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణాన్ని కన్నుల వేడుకగా నిర్వహించారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షులు వీలా కనకరాజు దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో దంపతులు హాజరై గోదాదేవి అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం అర్చకులు కిశోర్‌శర్మ ఆధ్వర్యంలో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్ఛారణల నడుమ కల్యాణాన్ని జరిపించారు.

వెటర్నరీ కాలనీలో...

ఆరిలోవ : పాతడైరీ ఫారం సమీపం వెటర్నరీ కాలనీ లక్ష్మీనారాయణ ఆశ్రమంలో కొలువుదీరిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సోమవారం గోదా దేవి రంగనాథుల కల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి రాంబాబు ఆచార్యులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వేడుకను జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల భజనలు, నృత్యాలు, గోవింద నామస్మరణ మధ్య అమ్మవారిని వేదికపైకి తీసుకువచ్చారు. 63 జంటలు ఈ వేడుకల్లో పాల్గొన్నాయి. ఇస్కాన్ గురూజీ శ్రీమాన్ రాధామనోహరదాస్ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామిని వట్టివేళ్లతో, ప్రసన్న అంజనేయుని ఊలు దారాల దండలతో అలంకరించారు.


కొత్త వెంకోజీపాలెం వెంకన్న ఆలయంలో..


ఎంవీపీ కాలనీలో వట్టివేళ్ల అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

బీచ్‌రోడ్డులో...

రామ్‌నగర్: బీచ్‌రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. గోదాదేవి, రంగనాయకలకు విశేష పూజలు నిర్వహించారు. వేడుకలకు పెద్దఎత్తున భక్తులు విచ్చేశారు.


బీచ్‌రోడ్డులో దర్శించుకుంటున్న భక్తులు

‘కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం’

ఆరిలోవ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో లేదా నిర్మానుష్య ప్రాంతాల్లో ఎవరైనా కోడి పందేలు ఆడినా, వాటిని నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు ఆడేందుకు పందెంరాయుళ్లు కొన్ని ప్రాంతాలను సిద్ధం చేసుకున్నారు. సరదా మాటున జూదంలా పెద్దమొత్తాల్లో డబ్బు పోగొట్టుకునే ప్రమాదం ఉందన్నారు. రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం తోటల్లోనూ, పైనాపిల్ కాలనీ మామిడితోటల్లోనూ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో కొందరు కోడి పందేలు ఆడే అవకాశం ఉన్నందున ఆయాచోట్ల గట్టి నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. పందేలు ఆడిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

‘ప్రజలపై విద్యుత్ భారం తగదు’


భోగీ మంటలో విద్యుత్ బిల్లులు వేసి తగలబెడుతున్న సీపీఎం శ్రేణులు

ఆరిలోవ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బీఎస్ఆర్ నగర్‌లో సోమవారం భోగీ మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కరెంటు చార్జీలు పెంచితే టీడీపీ, జనసేన పార్టీల నాయకులు ‘బాదుడే బాదుడు’ అంటూ ఉపన్యాసాలు ఇచ్చారని, స్మార్ట్ మీటర్లు పెడితే తగలబెట్టడానికి ముందుంటానని లోకేశ్ చేసిన ప్రకటనను గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ప్రజలపై రూ.16 వేల కోట్ల భారం మోపడం సరైన విధానం కాదన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం వల్ల ప్రజలపై మరింత ఆర్థికభారంతో పాటు గ్రామాలు అంధకారంలోకి వెళ్తాయన్నారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగ సమయంలో కరెంటు చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పి.నాగమణి, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖ-చర్లపల్లి మధ్య సంక్రాంతి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, చర్లపల్లి మధ్య ఒక ట్రిప్పు (రాను పోను) ప్రత్యేక రైలు ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08523 నంబరు గల రైలు మంగళవారం సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.30 గంటలకు చెర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08524 నంబరుతో రైలు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు చెర్లపల్లిలో బయలుదేరి రాత్రి 10.20 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు నాలుగు సెకెండ్ ఏసీ, రెండు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు ఉంటాయన్నారు.

అంధుల మహిళల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర శుభారంభం


.ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ఆంధ్ర క్రికెటర్ రమ్య

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధుల మహిళల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు శుభారంభం చేసింది. కొచ్చిన్‌లో సోమవారం జరిగిన తొలిమ్యాచ్‌లో ఆంధ్ర 51 పరుగుల తేడాతో న్యూఢిల్లీపై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 142 పరుగులు చేసింది. రవని (24), రమ్య (20) రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యూఢిల్లీ 92 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. ఆల్ రౌండర్ ప్రతిభ చూపిన ఆంధ్ర క్రికెటర్ రమ్య ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంది.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 54, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 46, బీరకాయలు 58, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 50, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 52, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీరదోస 40, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమ దుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 76, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 46, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్ద కట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 34, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామ కాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)	
(వంద - రూ.లలో)	
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు	
బ్యాగ్	
రైతు ధర	112
లైవ్ ధర	132
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	244

సరకుల కొనుగోళ్లతో రైతు బజారు రద్దీ


కొనుగోలుదారులతో ఎంవీపీ రైతు బజారులో కోలాహలం

ఎంవీపీ కాలనీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందడి రైతు బజారులోనూ కనిపించింది. ఓ పక్క పల్లెలకు నగరవాసులు ప్రయాణమై, రహదారులు ఖాళీ అవుతుంటే, మరో పక్క ఆది, సోమవారాల్లో రైతు బజారు కిక్కిరిసింది. ఈ రెండు రోజుల్లో కొందరు వినియోగదారులు రద్దీకి భయపడి తిరుగుముఖం పట్టారు. ముఖ్యంగా సంక్రాంతి రోజున ఇంట్లో పూజలకు, వంటలకు వినియోగించే సరకులకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. చిన్నారులపై వేసే భోగి(రేగు) పళ్లకు డిమాండ్ పెరిగింది. చిన్న పరిమాణంలోనే పండిపోయిన వాటిని భోగి పళ్లకు వినియోగిస్తారు. నగరంలో చాలా చోట్ల ఇవి కనిపించలేదు. కొన్ని చోట్ల మాత్రమే అందుబాటులో ఉన్నా, సాధారణ రోజుల్లో ఇలా పడిపోయిన, వాడిపోయిన వాటికి అస్సలు డిమాండ్ ఉండదు. పావు కిలో పది రూపాయలకు విక్రయిస్తుంటారు. కానీ ఆది, సోమవారాల్లో ఇవి దొరికిన చోట పావుకిలో రూ.50లకు విక్రయించారు. చాలా ఇళ్లలో సంక్రాంతి రోజున కలగూర వంట వండడం సంప్రదాయం. ఈ కూరలో వినియోగించే చిలగడ దుంప, కంద, గుమ్మడి, ఆనపకాయ వంటి వాటికి డిమాండ్ కనిపించింది. సోమవారం ఉదయం టమోటా తక్కువ రావడంతో వినియోగదారులకు లభ్యం కాలేదు. సాయంత్రం బజారులో అందుబాటులోకి వచ్చాయి. ఉల్లి, ఇతర కూరగాయలు, పూలు, పూలదండలు బాగా అమ్ముడయ్యాయి. సంక్రాంతి రోజున చాలా మంది రైతులు వచ్చే అవకాశం లేదు. వినియోగదారులు కూడా చాలా తక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. బుధవారం రైతు బజారుకు సెలవు. గురువారం నుంచి మళ్లీ యథావిధిగా రైతుబజారు కళకళలాడే అవకాశం ఉంది.

కబడ్డీ టోర్నీ చాంప్ విశాఖ


క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నీలో విశాఖ పురుషులు, మహిళల జట్టు చాంపియన్‌గా నిలిచాయి. కర్నూలులో జరిగిన టోర్నీ ఫైనల్స్‌లో మహిళల జట్టు ఆతిథ్య కర్నూలుపై పది పాయింట్ల తేడాతో పురుషుల జట్టు కర్నూలుపై 12 పాయింట్ల తేడాతో విజయం సాధించి చాంపియన్ ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం తన కార్యాలయంలో విజేతలను అభినందించి జాతీయ స్థాయి టోర్నీలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ సంఘం ప్రతినిధులు ఉరుకూటి శ్రీనివాస్, ఉమాశంకర్ బాబు, వి.బాబూరావు, గణపతిరావు, కోటేశ్వరరావు, ప్రకాష్, పి.సత్యనారాయణ, కోచ్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మకర జ్యోతి దర్శనం

పెందుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పెందుర్తిలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళ వారం మకర సంక్రాంతి సందర్భంగా మకర జ్యోతి దర్శనం భక్తులకు లభిస్తుందని అ య్యప్ప సేవా ట్రస్ట్ తెలిపింది. ఉదయం పది గంటలకు మహాగణపతి హోమం, అయ్య ప్పకు అష్టాభిషేకం, సాయంత్రం 6.15 గంటలకు దీపరాధాన, 6.40కు మకర జ్యోతి దర్శనం, 7 గంటలకు పడిపూజ మహోత్సవం నిర్వహిస్తామన్నారు.

పెందుర్తిలో సందడి

పెందుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని సంబరంగా జరుపుకునేందుకు జనం సిద్ధమయ్యారు.స్థానిక నాలుగురోడ్ల కూడలిలో మార్కెట్‌కు సోమవారం పండగ శోభ వచ్చింది. పలువురు పూజా సామగ్రి కొనుగోలు చేశారు. చెరకు గడలు, అరటి పండ్లు, కొబ్బరికాయలు, రంగుల విక్రయాలు జోరుగా సాగాయి. వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి.

కిటకిటలాడిన మార్కెట్లు



గోపాలపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో వారం రోజులుగా రద్దీగా ఉన్న మార్కెట్లకు సోమవారం కొనుగోలుదారుల తాకిడి తగిలింది. సాధారణంగా భోగి రోజు రద్దీ తగ్గుముఖం పడుతుంది. అయితే ఈ ఏడాది సోమవారం బజార్లు కిక్కిరిసాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రధాన రహదారిలోని వ్యాపార సముదాయాలకు కొనుగోలుదారుల తాకిడి కనిపించింది. ఇక కూరగాయలు, పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో రైతుబజారు కిక్కిరిసిపోయింది.



ఆలోచింపజేసిన విద్యార్థుల ఉమ్మడి కుటుంబం ప్రదర్శన

ఆకట్టుకున్న విద్యార్థుల కళా ప్రదర్శనలు

ఆనందపురం జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విజ్ఞాన విహార 45 వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం జరిగిన కళా ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. శారద ప్రార్థనతో ప్రారంభమైన కార్యక్రమంలో మొదటిగా 8,9,10 వ తరగతి మణిపూర్ విద్యార్థుల నృత్యం అభిమానులను ఆకట్టుకుంది. ఉమ్మడి కుటుంబం విశిష్టతను చాటి చెబుతూ పరమేశ్వరుడి కుటుంబమే అందుకు నిదర్శనమని అనుబంధాలు, ఆప్యాయతలు మాత్రమే ఉమ్మడికి మూల సూత్రాలని తెలిపారు. బంధాలు బలపడేందుకు భారతీయ కుటుంబమే ఉదాహరణని విశ్వ ప్రేమకు ఇది బలంగా నిలుస్తుందని విద్యార్థులు తమ నృత్యం అభినయం ద్వారా కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. మానవ జీవన లయకు పర్యావరణం దోహదపడుతుందని, పచ్చదనం కోల్పోతే అన్ని రకాల కాలుష్యాలు మానవ జాతిని తీవ్ర సంక్షోభంలోకి నెట్టివేస్తాయని ప్రకృతి గతి తప్పుతుందని, సకల జీవరాశి మనుగడ ప్రశ్నార్థకమవుతుందని 8వ తరగతి విద్యార్థులు ప్రదర్శించిన వృక్షో రక్షత రక్షితః నాటకం పర్యావరణ సందేశాన్ని ఇచ్చింది. వీటితో పాటు విద్యార్థుల అద్భుత నటన, యోగా, నృత్య ప్రదర్శనకు ప్రేక్షకులు కరతాళధ్వనులతో ఆశీర్వదించారు. విద్యా భారతి పంచ పరివర్తనలో భాగంగా ప్రదర్శించిన సామాజిక కళా ప్రదర్శనలు విజయవంతంగా జరిగినట్లు పాఠశాల కమిటీ తెలియజేసింది. ఈ కార్యక్రమాలకు కమిటీ సభ్యులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా భోగి పండుగ



వైశాఖి పార్కు వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు



పార్కు ప్రాంగణంలో పులి వేషాలు



జనసేన కార్యాలయం వద్ద తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

మాధవధార, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని మురళీ నగర్, మాధవధార జంట కాలనీల్లో సోమవారం భోగి పండుగ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. వేకువ నుంచే కాలనీ వీధుల్లో భోగి మంటలు వేసి, ప్రజలు సంప్రదాయాన్ని చాటారు. దాదాపు ప్రతి ఇంటా చక్కని రంగవల్లులు, కాలనీ వాసులంతా కలసి ఓ చోట భోగి మంటల వద్ద సామూహికంగా వేడుకలు నిర్వహించారు. మాధవధార ఉడాకాలనీ నివాసితుల సంక్షేమ సంఘం, మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ సంక్షేమ సంఘం సహా ప్రసిద్ధ ఆలయాలైన మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఆర్‌అండ్‌బీ భూసమేత విజయ వేంటేశ్వర స్వామి ఆలయం, గాంధీనగర్ రామాలయాల్లో శాస్త్రోక్తంగా భోగి వేడుకలు నిర్వహించారు. మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో జరిగిన సంబరాలు అంబరాన్నంటాయి. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ మన సంప్రదాయాల్ని ఇలాగే కాపాడుతూ, భావితరానికి తెలుగుదనం మజా చూపాలన్నారు. పార్కులో భోగి మంటలు, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. గంగిరెద్దులు, పులి వేషాలతో పార్కు కమిటీ అధ్యక్షుడు వరప్రసాద్, కార్యదర్శి పి.వి.ఎస్.ఎన్.రాజు, పాలకవర్గ సభ్యులు కాలనీ వాసులకు సౌకర్యాలు కల్పించారు.

జనసేన కార్యాలయంలో..

సీతంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో సోమవారం భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా భోగీ మంట వేసి వేడుకలను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే, జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. తెల్లవారు జాము అయిదు గంటలకే పార్టీ కార్యాలయానికి చేరుకున్న శ్రేణులు ఆనందోత్సాహాలు, కేరింతలతో నృత్యం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తప్పెటగుళ్ల ప్రదర్శన, డూడూ బసవన్నలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో జనసేన మహిళ సమన్వయకర్త అమరాపు దుర్గ, నాగలక్ష్మి, కిరణ్ ప్రసాద్, సమన్వయకర్త శివప్రసాద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నారా అమ్మాజీ, వార్డు అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు, చంటి, అంగటి శ్రవణ్, బోగిల శ్రీనివాస్ పట్నాయక్, వీరమహిళలు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆనందహేల

మహారాణిపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆనందోత్సాహాల మధ్య విద్యార్థినులు సంక్రాంతి వేడుకలు జరుపుకొన్నారు. సోమవారం ఇక్కడి ఓ కళాశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా సంప్రదాయ దుస్తులు ధరించి ముగ్గులు వేశారు. డూడూ బసవన్నలు, హరిదాసు, గొబ్బెమ్మల ప్రదర్శనతో సందడి చేశారు. విద్యార్థులు భోగీ మంట వేశారు. అనంతరం పతంగులను పోటాపోటీగా ఎగురవేశారు. అందరూ కలిసి పాటలు పాడుతూ, నృత్యాలతో పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని ఉల్లాసంగా గడిపారు. విద్యార్థినులు తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కళాశాల కరస్పాండెంట్ రవిశంకర్‌వర్మ, ప్రిన్సిపాల్ సత్యనారాయణలు వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు



మహారాణిపేటలో భోగీ మంట చుట్టూ సందడి చేస్తున్న విద్యార్థినులు

అలరించిన ముగ్గుల పోటీలు

» మొదటి ముగ్గురు మహిళా విజేతలకు నగదు బహుమతి ప్రదానం



వన్‌టౌన్ కొత్తరోడ్డులో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మహిళలు వేస్తున్న రంగవల్లికలు



మొదటి బహుమతి విజేత లక్ష్మీదేవికి నగదు బహుమతి అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

జగదాంబం కూడలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చుక్కలు, గీతల ముగ్గులను రంగుల్లో తీర్చిదిద్దిన మహిళలు నేలకు సరికొత్త కళ తెచ్చారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, ముగ్గులు తిలకించేందుకు వచ్చిన ఎమ్మెల్యే వంశీకృష్ణ, పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మహిళల నైపుణ్యాన్ని చూసి అచ్చెరువొందారు. వన్‌టౌన్ మెయిన్ రోడ్డుపై వేసిన ముగ్గులు చూసి న్యాయనిర్ణేతలు, స్థానికులు ఆనందం వ్యక్తంచేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం కొత్త రోడ్డు వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలో దాదాపు 350 మంది మహిళలు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి లక్ష్మీదేవి, ద్వితీయ బహుమతి మంగ, తృతీయ బహుమతి పద్మావతి అనే మహిళ గెలుచుకున్నారు. విజేతలకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ నగదు బహుమతిని అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు అందజేశారు. విజేతలను ఎమ్మెల్యే వంశీకృష్ణ, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

డాబాగార్డెన్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం తెల్లవారు జామున డాబాగార్డెన్స్, జగదాంబ, ప్రకాశ్‌రావుపేట డౌన్ తదితర ప్రాంతాల్లో భోగి మంటల దగ్గర ఉల్లాసంగా గడిపారు. పల్లె వాతావరణాన్ని ప్రజలకు తెలియజేసేందుకు రంగవల్లుల పోటీ నిర్వహించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. చెడును అంతం చేయడమే భోగి పండుగ ప్రత్యేకత అని ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు: సీఐ హెచ్చరిక



సూచనలు చేస్తున్న సీఐ రమణ

సీతమ్మధార, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాతి పండుగ నేపథ్యంలో కోడి పందాలు, పేకాట, గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ అన్నారు. ప్రజలు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని ఆస్తులను నష్టపోవద్దని సూచించారు. ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 112 నెంబరుకు, నగర పోలీసు కమిషనర్ 79950 95799, లేదా సమీప పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ రమణ కోరారు.

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అల్లిపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం వేంకటేశ్వర మెట్టపై వేంచేసిన వేంకటేశ్వర దేవస్థానంలో భోగి పండుగ సందర్భంగా సోమవారం గోదాదేవి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ మండపంలో గోదాదేవికి రంగనాయకకు కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య సంప్రదాయబద్ధంగా ఈ కల్యాణాన్ని గోవింద నామస్మరణ మధ్య అత్యంత ఘనంగా నిరహించారు. గోదాదేవి రంగనాయకకు భక్తులు పట్టువస్త్రాలు, చీరలు అందజేశారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రామవాచారి, గొడవర్తి రామచంద్రాచార్యులు ఈ కల్యాణాన్ని నయనానందకరంగా జరిపించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి పర్యవేక్షణలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించగా అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిపారు.

విశాఖ-చర్లపల్లి మధ్య సంక్రాంతి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, చర్లపల్లి మధ్య ఒక ట్రిప్పు (రాను పోను) ప్రత్యేక రైలు ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08523 నంబరు గల రైలు మంగళవారం సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరునటి రోజు ఉదయం 7.30 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08524 నంబరుతో రైలు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి రాత్రి 10.20 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు నాలుగు సెకెండ్ ఏసీ, రెండు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు ఉంటాయన్నారు.

రైతుబజార్ కిటకిట

సీతమ్మధార, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్ సోమవారం కొనుగోలుదారులతో ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడింది. మంగళవారం సంక్రాంతి రోజు బజార్‌క సెలవు కావడంతో జనం పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. కొబ్బరికాయలు, అరటి పండ్లు, పూలదుకాణాల వద్ద రద్దీ నెలకొంది.

అంధుల మహిళల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర శుభారంభం



.ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ఆంధ్ర క్రికెటర్ రమ్య

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధుల మహిళల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు శుభారంభం చేసింది. కొచ్చిన్‌లో సోమవారం జరిగిన తొలిమ్యాచ్‌లో ఆంధ్ర 51 పరుగుల తేడాతో న్యూఢిల్లీపై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 142 పరుగులు చేసింది. రవని (24), రమ్య (20) రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యూఢిల్లీ 92 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. ఆల్ రౌండర్ ప్రతిభ చూపిన ఆంధ్ర క్రికెటర్ రమ్య ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంది.

కబడ్డీ టోర్నీ చాంప్ విశాఖ



క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నీలో విశాఖ పురుషులు, మహిళల జట్టు చాంపియన్‌గా నిలిచాయి. కర్నూలులో జరిగిన టోర్నీ ఫైనల్స్‌లో మహిళల జట్టు ఆతిథ్య కర్నూలుపై పది పాయింట్ల తేడాతో పురుషుల జట్టు కర్నూలుపై 12 పాయింట్ల తేడాతో విజయం సాధించి చాంపియన్ ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం తన కార్యాలయంలో విజేతలను అభినందించి జాతీయ స్థాయి టోర్నీలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ సంఘం ప్రతినిధులు ఉరుకూటి శ్రీనివాస్, ఉమాశంకర్ బాబు, వి.బాబూరావు, గణపతిరావు, కోటేశ్వరరావు, ప్రకాష్, పి.సత్యనారాయణ, కోచ్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం



ఆంధోనీ నగర్‌లో వ్యర్థాలు ఇలా...

మహారాణిపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక 29వ వార్డులో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా వార్డులో ఎక్కడ చూసినా చెత్తనిల్వలు పేరుకుపోయాయి. కనీసం పండుగ రోజుల్లో కూడా సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోవటంతో చెత్త నిల్వలు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దండుబజారు, ఆంధోనీనగర్, అంగటిదిబ్బ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య లోపం కనిపిస్తోంది. చెత్త నిల్వలతో దోమలు విజృంభించడంతో ప్రజలు మండిపడుతున్నారు. అసలే తీవ్రమైన డెంగ్యూ, మలేరియా వైరల్ విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతూ ఉంటే పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవటం గమనార్హం. ప్రజారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

నగరం... నిర్మానుష్యం

... 7వ పేజీ తరువాయి

చెందినవారే. ఏడాదంతా ఉద్యోగం, వ్యాపారం ఇతర వ్యాపకాల్లో బిజీగా గడిపినవారంతా సంక్రాంతికి స్వస్థలాలకు వెళ్లి సంక్రాంతిని జరుపుకోవడానికి ఆసక్తిచూపుతారు. విద్యాసంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11 నుంచి 19 వరకూ సెలవులు ప్రకటించింది. దీంతో చాలామంది ఈనెల 11 నుంచే ప్రయాణాలు పెట్టుకున్నారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసేవారు, వ్యాపారులు, స్వయం ఉపాధి చేసుకునేవారు, కూలిపనులు చేసుకునేవారు మాత్రం ముందుగా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఆది, సోమవారాల్లో స్వస్థలాలకు పయనమయ్యారు. మిగిలిపోయినవారు భోగి పండగను సోమవారం నగరంలోనే జరుపుకుని బయలుదేరారు. దీనివల్ల మధ్యాహ్నం 12 గంటల వరకు అనకాపల్లి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే మార్గాలపై వాహనాల రద్దీ కనిపించినా తర్వాత పూర్తిగా తగ్గిపోయింది. నిత్యం వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌తో పద్మవ్యూహాన్ని తలపించే హనుమంతవాక కూడలి, వెంకోజీపాలెం, ఇసుకతోట, ఎంవీపీకాలనీ, సత్యం జంక్షన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్, గాజువాక వంటి ప్రధాన కూడళ్లు రద్దీ లేకపోవడంతో కళా విహీనంగా మారాయి. ద్వారకనగర్, ఆశీల్‌మెట్ట నుంచి జగదాంబ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్‌నుంచి డాబా గార్డెన్స్ రోడ్డులో వాహనాల రాకపోకలు తగ్గిపోయాయి. నగరంలో ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటలు వరకూ విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. ఒక్కో కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ పడితే వాహనాలు కిలోమీటరు పొడవునా బారులుతీరిపోతాయి. కానీ సోమవారం నగరంలో పరిస్థితి దీనికి పూర్తివిరుద్ధంగా కనిపించింది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్‌సిగ్నల్‌పడినా పదిలోపు వాహనాలు మాత్రమే ఆగిఉంటున్నాయి.

సాధారణంగా సెలవురోజుల్లో కోలాహలంగా కనిపించే బీచ్, జూపార్క్ సందర్శకుల తాకిడిలేకపోవడంతో ఖాళీగా కనిపించాయి. తప్పనిసరి పరిస్థితిలో నగరంలోనే పండగ జరుపుకునేందుకు ఉండిపోయినవారు మాత్రం బీచ్‌కు వెళ్లి గాలిపటాలు ఎగరవేస్తూ కాలక్షేపం చేశారు. రాత్రికాగానే వారంతా తిరిగి ఇళ్లకు చేరిపోవడంతో బీచ్ నిర్మానుష్యంగా మారిపోయింది. ఊరెళ్లినవారంతా సంక్రాంతి, కనుమ పండగలను స్వస్థల్లాలో జరుపుకున్న తర్వాతే తిరిగి వస్తారు కాబట్టి అంతవరకూ నగరంలో ఇదే పరిస్థితి కొనసాగుతుందని అంచనా.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జీవీఎంసీ యుద్ధం

... 7వ పేజీ తరువాయి

ప్లాస్టిక్ ఎక్కడ అందుబాటులో ఉందో సమాచారం స్క్రీన్‌పై కనబడుతుంది. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగదారులకు అందజేసినా వీధివ్యాపారులకైతే మొదటిసారి రూ.2,500, రెండోసారి పట్టుబడితే రూ.ఐదు వేలు జరిమానా విధిస్తామని, మూడోసారి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదుచేసే అవకాశాలను పరిశీలిస్తామని హెచ్చరించారు. దుకాణాలు, వ్యాపారసంస్థలు సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్‌ను వాడుతూ మొదటిసారి పట్టుబడితే రూ.25వేలు, రెండోసారి పట్టుబడితే రూ.40వేలు జరిమానా. మూడోసారి పట్టుబడితే ట్రేడ్‌లైసెన్స్ రద్దుచేసి వారి కుటుంబంలో మరెవరికీ లైసెన్స్ ఇవ్వకుండా నిషేధం విధిస్తామని కమిషనర్ ప్రకటించారు. అయితే మరో నెలరోజులపాటు అవగాహన కల్పించడం, దుకాణాలపై దాడులు చేసి సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్ ఉంటే సీజ్‌చేయడంతో సరిపెట్టాలని వెసులుబాటు కల్పించారు. ఫిబ్రవరి నుంచి జరిమానా విధిస్తామన్నారు. దీంతో ప్రత్యేక బృందాలు ఇప్పటివరకు సుమారు 500 దుకాణాలపై దాడులు చేసి ఆరు టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్‌చేసినట్టు కమిషనర్ తెలిపారు.

కేజీహెచ్‌లో మరో రెండు డయాలసిస్ సెంటర్లు

... 7వ పేజీ తరువాయి

సిద్ధమవుతున్నారు. కొద్దిరోజుల్లోనే ఈ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు.

ప్రతి రోజూ 50 మందికి సేవలు..

ప్రస్తుతం కేజీహెచ్‌లో ప్రతిరోజూ 50 మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. నెఫ్రాలజీ విభాగంలోని పది డయాలసిస్ యంత్రాలతో ఉన్న సెంటర్‌లో ప్రతిరోజూ 20 మందికి సేవలు అందుతుండగా, సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోనే నెఫ్రోప్లస్ అనే సంస్థ ద్వారా ప్రత్యేకంగా రోజుకు 30 మదికి డయాలసిస్ సేవలందిస్తున్నారు. నెఫ్రోప్లస్‌లో అందించే సేవలకు ఓపీ విధానంలో రోగులు డయాలసిస్ చేయించుకుని వెళ్తుంటారు. కాగా వార్డులో ఇన్‌పేషెంట్లు, ఇతర విభాగాల నుంచి వచ్చే వారికి సేవలందిస్తారు. ఇతర విభాగాల్లో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులను ఇక్కడకు తీసుకువచ్చి సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన అధికారులు ప్రత్నామ్నాయంగా ఈ రెండు వార్డుల్లో డయాలసిస్ సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

వసతి గృహానికి మహిళ తరలింపు



ఆర్పీఎఫ్ సిబ్బందితో దమయంతి

అక్కయ్యపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ రైల్వేస్టేషన్‌లో దిక్కుతోచని స్థితిలో ఉన్న బరంపురం ప్రాంతానికి చెందిన చౌదరి దమయంతి (70)ని టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆమె నర్సుగా పనిచేసి రిటైర్ అయ్యారని, పింఛన్ రూ.43 వేలు వస్తున్నాయని చెప్పారు. రెండు రోజుల క్రితం ఆమె కాశీ వెళ్లి వస్తూ వైజాగ్ రైల్వేస్టేషన్‌లో దిగిపోయిందని, ఆర్పీఎఫ్ సిబ్బంది తమకు సమాచారమిచ్చారని, ఆమె దగ్గర ఉన్న రూ.7 వేలు, సెల్‌ఫోన్ రైల్వేస్టేషన్‌లోనే పోగొట్టుకుందని తెలిపారు. దమయంతికి ఇద్దరు కుమారులు, కూతుళ్లు ఉన్నారన్నారు. ఆమె మనవడు ఫోన్ నెంబరు తీసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

స్తబ్దుగా రియల్ వ్యాపారం

... 7వ పేజీ తరువాయి

తగ్గించడం లేదు. ఈరోజు కాకపోతే రేపు అమ్ముకున్నా మంచి ధర వస్తుందని వేచి చూస్తున్నారు. దీంతో లావాదేవీలు జరగడం లేదు.

అరకొరగా ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు

చాలామంది విశాఖలో ఫ్లాటు కొనాలంటే... సొంత ఊళ్లోనో.. మరోచోటో ఉన్న స్థిరాస్తిని అమ్మి, ఆ మొత్తానికి మరికొంత బ్యాంకు రుణం జోడించాల్సి వస్తోంది. అలా ఒకటి అరా ఫ్లాట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కృత్రిమ డిమాండ్ వల్ల రేట్లు పెరిగిపోయాయి. ఒకసారి పెంచితే తగ్గించే అలవాటు లేకపోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి వచ్చింది.

- జి.బాలకృష్ణ, డీఐజీ, రిజిస్ట్రేషన్ల శాఖ

సంబరంగా భోగి

... 7వ పేజీ తరువాయి

భోగి మంట వేశారు. బీచ్‌రోడ్డులో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో దేశీయగోవు పేడతో తయారుచేసిన లక్ష పిడకలతో బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ ఎదుట భోగిమంట వేశారు. తారురోడ్లపై భోగి మంటలు వేయవద్దని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ చేసిన విజ్ఞప్తిని ప్రజలు పట్టించుకోకుండా రహదారులపైనే మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు.

వైసీపీ సానుభూతిపరులదే హవా!

... 7వ పేజీ తరువాయి

ఉండడంతో లబ్ధిదారులు నిర్మాణానికి ముందుకు రాలేదు. దీంతో హౌసింగ్ కార్పొరేషన్ ప్రమేయంతో అనధికారికంగా పలువురు కాంట్రాక్టర్లకు నిర్మాణాల బాధ్యత అప్పగించారు. ప్రధానంగా నెల్లూరు, అనంతపురం జిల్లాలకు చెందిన వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లే ఎక్కువ పనులు తీసుకున్నారు. వీరికి హౌసింగ్ అధికారులు అధిక ప్రాధాన్యతనిస్తూ రెడ్‌కార్పెట్ పరిచారు. మెటీరియల్ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చి, బిల్లుల మంజూరు ఆగమేఘాలపై ఫైళ్లు కదిపారు. ఇంతచేసినా గత ప్రభుత్వంలో అనంతపురంలోని ఓ వైసీపీ ఎమ్మెల్యేకి చెందిన రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థ ఇళ్ల నిర్మాణంలో చతికిలబడింది. అయినా ఈ సంస్థకు అధికంగా బిల్లులు చేసిన అధికారులు వైసీపీపై భక్తిభావంచాటుకున్నారు.

ప్రభుత్వం మారినా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైసీపీ మద్దతుదారులైన కాంట్రాక్టర్ల హవా కొనసాగుతోంది. వారు చెప్పిందే హౌసింగ్ కార్యాలయంలో జరుగుతోందనే వాదన ఉంది. అధికారులు వారికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ చిన్న కాంట్రాక్టర్లను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా పనులు చేపట్టాలని నాలుగు నెలల కొందట ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కాంట్రాక్టర్లు నిర్మాణాలు ప్రారంభించారు. పనులుచేసిన వెంటనే ఎం.బుక్‌లో వివరాలు నమోదు చేయడంలో పెద్ద కాంట్రాక్టర్లకే అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. బిల్లులు మంజూరు చేయడంలోనూ ఆగమేఘాల మీద పనిచేస్తున్నారు. వారు కోరిన మేరకు ఇసుక సరఫరా చేస్తున్న అధికారులు, చిన్న కాంట్రాక్టర్లను పక్కన పెట్టేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఓ కాంట్రాక్టరు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారని తెలిసింది. తన పేరు బయటకు వస్తే వేధింపులకు దిగుతారనే అనుమానంతో వివరాలు చెప్పడానికి వెనుకాడారు.

ఇప్పటికీ వైసీపీ సేవలోనే...

జిల్లా హౌసింగ్ కార్యాలయంలో గతంలో పనిచేసిన ఉన్నతాధికారి నెల్లూరు కాంట్రాక్టర్లకు అనుకూలంగా ఉండేవారని, ఇందుకు గాను ఓ కారు బహుమతిగా అందుకున్నారని సిబ్బందే గుసగుసలాడుతున్నారు. ఆ తరువాత వచ్చిన అధికారులు కూడా వైసీపీ అనుకూలురుకే పని చేసి పెడుతున్నారని చెబుతున్నారు. పెద్ద కాంట్రాక్టర్లకు సరఫరా చేసిన ఇసుక నుంచి కొన్ని లారీలను పక్కదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆశాజనకం

... 7వ పేజీ తరువాయి

వసూలైంది. గత ఏడాదితో పోల్చితే ఈసారి రూ.31 కోట్లు అధికంగా వసూలు చేయడంతో మిగిలిన రూ.169 కోట్ల వసూలుకు కార్యాచరణ రూపొందించుకుని అమలుచేస్తున్నారు.

బకాయిలపైనా ప్రత్యేక దృష్టి

నగర పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లతోపాటు కోర్టు కేసులపేరుతో పెండింగ్‌లో ఉండిపోయిన బకాయిల వసూళ్లపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. కోర్టులో కేసులు వేసినవారితో స్వయంగా మాట్లాడుతున్నారు. లేదంటే రెవెన్యూ అధికారులను పంపి చర్చలు జరిపిస్తున్నారు. ఈ సందర్భంగా కేసు విత్‌డ్రా చేసుకునేలా ఒప్పిస్తున్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న సంస్థల నుంచి పెండింగ్ బకాయిలను రాబట్టేలా ఆయాశాఖల ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నారు. దీనివల్ల పెండింగ్ బకాయిలు కూడా జీవీఎంసీ ఖాతాకు జమవుతున్నాయి. మరోవైపు ప్రతి వారం రెవెన్యూ విభాగంపై సమీక్షలు నిర్వహించి జోన్‌ల వారీగా పన్ను వసూళ్లపై ఆరాతీస్తున్నారు. మరోవైపు కమిషనర్ ఆదేశాలతో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు ప్రతిరోజూ ఏదో ఒక జోన్‌లో భారీమొత్తంలో ఆస్తిపన్ను బకాయి ఉన్న అసెస్‌మెంట్‌లకు వెళ్లి అధికారులు/ ప్రైవేటు ఆస్తి యజమానులతో మాట్లాడి పన్ను చెల్లించేలా ఒప్పించడం, అసెస్‌మెంట్‌ల వారీగా తనిఖీలు చేస్తున్నారు. ఎవరికైనా అసెస్‌మెట్ జారీచేయకపోయినా, జాప్యం జరిగినా సంబంధిత వార్డు టాక్స్‌కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను నిలదీయడంతోపాటు చర్యలకు కమిషనర్‌కు సిఫార్సు చేస్తున్నారు. దీంతో పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో పెరిగాయని ఆ విభాగం సిబ్బంది చెబుతున్నారు.

వాడవాడలా ఆనందాల భోగి

▸ ఎటుచూసినా కోలాహలం ▸ వేకువనే భోగిమంట వద్దకు కుటుంబాలతో విచ్చేసి సందడి
▸ ఏయూ మైదానంలో మిన్నంటిన సంబరాలు ▸ ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ దంపతులు హాజరు



పాత వెంకోజీపాలెంలో భోగి మంట కాగుతున్న పిల్లలు, పెద్దలు



ఏయూ మైదానంలోని భోగి వేడుకల్లో ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ దంపతులు, రాజ్యసభ మాజీ సభ్యులు జీవీఎల్

మద్దిపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : భోగి పండుగను నగరవాసులు సోమవారం ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. ఇందులో భాగంగా జీవీఎంసీ 22, 23 వార్డుల్లో మరింత కోలాహల వాతావరణం నెలకొంది. వీధివీధిన యువత భోగి మంట వేశారు. అంతానే వేకువనే నిద్రలేచి, తలంటుపోసుకుని కొత్తబట్టలు ధరించి కుటుంబాలతో సహా భోగి మంట వద్దకు విచ్చేశారు. పిల్లల కేరింతల నడుమ ఈ వేడుక మిన్నంటింది. కొందరు పిల్లలకు భోగిపండ్లు పోశారు. ఇదిలావుంటే, ఆంధ్రా యూనివర్సిటీ మైదానంలో జీవీఎల్ మకర సంక్రాంతి వేడుకల్లో భాగంగా భోగి పండుగను ఘనంగా నిర్వహించారు. రాజ్యసభ మాజీ సభ్యులు జీవీఎల్ నరసింహారావు దంపతులు పూజలు చేసి భోగి మంట వెలిగించారు. ఈ వేడుకకు ప్రముఖ సినీ నటుడు సాయికుమార్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భోగి పండుగ విశిష్టతను వివరించారు. ఇలాంటి వేడుకలు నిర్వహించడం ద్వారా మన సం స్కృతీ సంప్రదాయాలను భావితరాలకు అందించినవారమవుతామన్నారు. అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

వెంకోజీపాలెంలో..

వెంకోజీపాలెం : భోగి పండుగను ఈ ప్రాంత ప్రజలు వాడవాడలా ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. అంతా వేకువజామునే లేచి నలుగు పిండి పెట్టుకుని, తలంటు పోసుకున్నారు. చిన్నపిల్లలకు ఒంటిపై తెల్లజిల్లేడు ఆకు ఉంచి, దానిపై రేగిపండ్లు పెట్టి స్నానాలు చేయించారు. అనంతరం అంతా నూతన వస్త్రాలు ధరించి భోగి మంట వద్దకు విచ్చేశారు. ఇళ్ల ముందు వేసిన ముగ్గులపై గొబ్బెమ్మలను పెట్టి వాటి చుట్టూ ముత్తైదువులు ప్రదక్షిణలు చేశారు. సంక్రాంతి పండుగ పాటలను పాడుకుంటూ సరదాగా గడిపారు.

ఆరిలోవలో...

ఆరిలోవ : భోగి పండుగను ఆరిలోవ పరిసర ప్రాంత ప్రజలు అత్యంత ఘనంగా జరుపుకున్నారు. అంతా వేకువనే నిద్రలేచి తలంటు పోసుకుని, ఇళ్ల ముంగిట వేసిన భోగి మంట వద్దకు విచ్చేసి ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు.

రామ్‌నగర్‌లో

రామ్‌నగర్: రామ్‌నగర్‌లో భోగీ పండుగను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామ్‌నగర్‌లో యువత భోగీ మంటలు వేసి ఆనందంతో కేరింతలు కొట్టారు. రోడ్లపై రంగురంగుల ముగ్గులు వేసి, వాటిపై గొబ్బెమ్మలు పెట్టి, చెరుకు గడలను అమర్చారు. రంగుల దీపాలు వెలిగించి పాటలు వినిపిస్తూ, బాణసంచా కాల్చారు. అనంతరం భోగీ మంట వేశారు. రామ్‌నగర్ వాసులు ఆబాలగోపాలం అక్కడకు చేరుకొని ఉత్సాహంగా గడిపారు.



రామ్‌నగర్‌లో భోగీ మంట

'కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం'

ఆరిలోవ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆరిలోవ పోలీసు స్టేషన్ పరిధిలోని బహిరంగ ప్రదేశాల్లో లేదా నిర్మానుష్య ప్రాంతాల్లో ఎవరైనా కోడి పందేలు ఆడినా, వాటిని నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా కోడి పందేలు ఆడేందుకు పందెంరాయుళ్లు కొన్ని ప్రాంతాలను సిద్ధం చేసుకున్నారు. సరదా మాటున జూదంలా పెద్దమొత్తాల్లో డబ్బు పోగొట్టుకునే ప్రమాదం ఉందన్నారు. రామకృష్ణాపురం, శ్రీకృష్ణాపురం తోటల్లోనూ, పైనాపిల్ కాలనీ మామిడితోటల్లోనూ, సాగర్‌నగర్ ప్రాంతాల్లో కొందరు కోడి పందేలు ఆడే అవకాశం ఉన్నందున ఆయాచోట్ల గట్టి నిఘా ఏర్పాటు చేశామని అన్నారు. డేగ చూపుతో పోలీసు సిబ్బంది గమనిస్తారని, పందేలు ఆడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ స్పష్టం చేశారు.

'ప్రజలపై విద్యుత్ భారం తగదు'



భోగీ మంటలో విద్యుత్ బిల్లులు వేసి తగలబెడుతున్న సీపీఎం శ్రేణులు

ఆరిలోవ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీల భారాన్ని తక్షణమే రద్దు చేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు వి.నరేంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బీఎస్ఆర్ నగర్‌లో సోమవారం భోగీ మంటల్లో విద్యుత్ బిల్లులు వేసి దహనం చేశారు. ఈ సందర్భంగా నరేంద్ర కుమార్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కరెంటు చార్జీలు పెంచితే టీడీపీ, జనసేన పార్టీల నాయకులు 'బాదుడే బాదుడు' అంటూ ఉపన్యాసాలు ఇచ్చారని, స్మార్ట్ మీటర్లు పెడితే తగలబెట్టడానికి ముందుంటానని లోకేశ్ చేసిన ప్రకటనను గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చి ప్రజలపై రూ.16 వేల కోట్ల భారం మోపడం సరైన విధానం కాదన్నారు. స్మార్ట్ మీటర్లు పెట్టడం వల్ల ప్రజలపై మరింత ఆర్థికభారంతో పాటు గ్రామాలు అంధకారంలోకి వెళ్తాయన్నారు. ఈ ఏడాది సంక్రాంతి పండుగ సమయంలో కరెంటు చార్జీలు పెంచడం దుర్మార్గమన్నారు. స్మార్ట్ మీటర్లను అందరూ వ్యతిరేకించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో పి.నాగమణి, జి.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





పాతడెయిరీ ఫారం సమీపంలో లక్ష్మీనారాయణ ఆలయంలో గోదాదేవి రంగనాథుల కల్యాణాన్ని వీక్షిస్తున్న భక్తజనం

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం

▸ ఘనంగా ముగిసిన ధనుర్మాసోత్సవాలు ▸ అమ్మవారికి విశేష పూజలు ▸ చివరి రోజుల ఆలయాలకు పోటెత్తిన భక్తులు

వెంకోజీపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ధనుర్మాసోత్సవాలను అంతా అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. నెల రోజుల పాటు గోదాదేవి అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా చివరి రోజైన సోమవారం గోదాదేవి కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఎంఎంటీసీ కాలనీ త్రిమూర్తిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ వేడుకను మరింత ఘనంగా జరిపారు. అర్చకులు వెంకటరమణాచార్య, గోపాల్ కృష్ణ, వంశీకృష్ణ తొలుత అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పలువురు దంపతులతో కల్యాణోత్సవాన్ని జరిపించారు. ఈ సందర్భంగా వారు వేడుక విశిష్టతను వివరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించి తరించారు. ఆలయ కార్యదర్శి డాక్టర్ ఎం.సావిత్రి, కోశాధికారి కె.సుబ్బారాయుడు, మేనేజర్ బి.సన్యాసిరావు, శివరామ్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఎంఎంటీసీ కాలనీలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో కన్నుల వేడుకగా కల్యాణోత్సవం

కొత్త వెంకోజీపాలెంలో...

కొత్త వెంకోజీపాలెంలోని కోదండ రామాలయంలో కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం గోదాదేవి కల్యాణాన్ని కన్నుల వేడుకగా నిర్వహించారు. గ్రామ సేవా సంఘం అధ్యక్షులు పీలా కనకరాజు దంపతులతో పాటు పెద్ద సంఖ్యలో దంపతులు హాజరై గోదాదేవి అమ్మవారికి పూజలు జరిపారు. అనంతరం అర్చకులు కిశోర్‌శర్మ ఆధ్వర్యంలో మేళతాళాలు, వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ కల్యాణాన్ని జరిపించారు.



కొత్త వెంకోజీపాలెం వెంకన్న ఆలయంలో..



ఎంవీపీ కాలనీలో వట్టివేళ్ల అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

వెటర్నరీ కాలనీలో...

ఆరిలోవ : పాతడైరీ ఫారం సమీపం వెటర్నరీ కాలనీ లక్ష్మీనారాయణ ఆశ్రమంలో కొలువుదీరిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో సోమవారం గోదా దేవి రంగనాథుల కల్యాణాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు ఆరవెల్లి రాంబాబు ఆచార్యులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ ఈ వేడుకను జరిపించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు.

ఎంవీపీ కాలనీలో..

ఎంవీపీ కాలనీ: ఎంవీపీ కాలనీ ఆరో సెక్టరు వేంకటేశ్వరస్వామి, ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో గోదారంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల భజనలు, నృత్యాలు, గోవింద నామస్మరణ మధ్య అమ్మవారిని వేదికపైకి తీసుకువచ్చారు. 63 జంటలు ఈ వేడుకల్లో పాల్గొన్నాయి. ఇస్కాన్ గురూజీ శ్రీమాన్ రాధామనోహరదాస్ భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. ఈ సందర్భంగా సుబ్రహ్మణ్య స్వామిని వట్టివేళ్లతో, ప్రసన్న అంజనేయుని ఊలు దారాల దండలతో అలంకరించారు.

బీచ్‌రోడ్డులో...

రామ్‌నగర్: బీచ్‌రోడ్డులోని పాండురంగ స్వామి ఆలయంలో గోదాదేవి కల్యాణం వేదమంత్రాలు, మంగళవాయిద్యాల మధ్య వైభవంగా నిర్వహించారు. గోదాదేవి, రంగనాయకలకు విశేష పూజలు నిర్వహించారు. వేడుకలకు పెద్దఎత్తున భక్తులు విచ్చేశారు.



బీచ్‌రోడ్డులో దర్శించుకుంటున్న భక్తులు

నిత్యాన్న ప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం

సింహాచలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిత్యాన్న ప్రసాద పథకానికి మధురవాడకు చెందిన మరుపిల్లి శ్రీనుబాబు రూ. లక్ష విరాళంగా సమర్పించారు. అన్నప్రసాద విభాగం ఏఈఓ పిళ్లా శ్రీనివాసరావుకు విరాళం మొత్తం రూ.1,01,116లను దాత నగదు రూపంలో ఆదివారం అందజేశారు. ఆలయ ఆచారం ప్రకారం అధికారులు దాత కుటుంబ సభ్యులకు స్వామివారి అంతరాలయ దర్శనం కల్పించి, వేదాశీర్వచనాలు, ప్రసాదాలను అందజేశారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్ మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 54, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 46, బీరకాయలు 58, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 46 దొండకాయలు 50, బంగాళ దుంపలు 26, అరటికాయ (పె)7, మునక్కాడలు (కిలో) 110, అల్లం (పాతది)48, బరబాటి 52, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోస కాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్ (పెన్సిల్) 58, పొటల్స్ 80, కీరదోస 40, కాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 76, దేముడు చిక్కుడు 76, గోరు చిక్కుడు 34, ఆగాకార దేశవాలి 100 , ఆగాకర హైబ్రిడ్ 50, కూర పెండలం 46, బ్రకోలి 80 , నూల్‌కోల్ 34, పనసపొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్టు) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, మామిడికాయలు 100, బూడిద గుమ్మడికాయ 34, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్)

(వంద - రూ.లలో)

విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు

బ్యాగ్	
రైతు ధర	112
లైవ్ ధర	132
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	244

సరకుల కొనుగోళ్లతో రైతు బజారు రద్దీ



కొనుగోలుదారులతో ఎంవీపీ రైతు బజారులో కోలాహలం

ఎంవీపీ కాలనీ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సందడి రైతు బజారులోనూ కనిపించింది. ఓ పక్క పల్లెలకు నగరవాసులు ప్రయాణమై, రహదారులు ఖాళీ అవుతుంటే, మరో పక్క ఆది, సోమవారాల్లో రైతు బజారు కిక్కిరిసింది. ఈ రెండు రోజుల్లో కొందరు వినియోగదారులు రద్దీకి భయపడి తిరుగుముఖం పట్టారు. ముఖ్యంగా సంక్రాంతి రోజున ఇంట్లో పూజలకు, వంటలకు వినియోగించే సరకులకు విపరీతమైన గిరాకీ ఏర్పడింది. చిన్నారులపై వేసే భోగి(రేగు) పళ్లకు డిమాండ్ పెరిగింది. చిన్న పరిమాణంలోనే పండిపోయిన వాటిని భోగి పళ్లకు వినియోగిస్తారు. నగరంలో చాలా చోట్ల ఇవి కనిపించలేదు. కొన్ని చోట్ల మాత్రమే అందుబాటులో ఉన్నా, సాధారణ రోజుల్లో ఇలా పడిపోయిన, వాడిపోయిన వాటికి అస్సలు డిమాండ్ ఉండదు. పావు కిలో పది రూపాయలకు విక్రయిస్తుంటారు. కానీ ఆది, సోమవారాల్లో ఇవి దొరికిన చోట పావుకిలో రూ.50లకు విక్రయించారు. చాలా ఇళ్లలో సంక్రాంతి రోజున కలగూర వంట వండడం సంప్రదాయం. ఈ కూరలో వినియోగించే చిలగడ దుంప, కంద, గుమ్మడి, ఆనపకాయ వంటి వాటికి డిమాండ్ కనిపించింది. సోమవారం ఉదయం టమోటా తక్కువ రావడంతో వినియోగదారులకు లభ్యం కాలేదు. సాయంత్రం బజారులో అందుబాటులోకి వచ్చాయి. ఉల్లి, ఇతర కూరగాయలు, పూలు, పూలదండలు బాగా అమ్ముడయ్యాయి. సంక్రాంతి రోజున చాలా మంది రైతులు వచ్చే అవకాశం లేదు. వినియోగదారులు కూడా చాలా తక్కువ సంఖ్యలో వచ్చే అవకాశం ఉంది. బుధవారం రైతు బజారుకు సెలవు. గురువారం నుంచి మళ్లీ యథావిధిగా రైతుబజారు కళకళలాడే అవకాశం ఉంది.

గేమ్ ఛేంజర్ సినిమాలో మంగమారిపేట వాసి



సినిమాలో నటించిన చింతలపూడి వెంకట్ (వృత్తంలో)

భీమునిపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ దర్శకుడు శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ హీరోగా నటించిన గేమ్ ఛేంజర్ సినిమాలో మంగమారిపేటకు చెందిన చింతలపూడి వెంకట్ నటించారు. మంగమారిపేట వారిజ ఆశ్రమం నేత్రవిద్యాలయంలో ఆయన కరాటే కోచ్‌గా పని చేస్తున్నారు. గేమ్ ఛేంజర్ సినిమాలో హీరో రామ్‌చరణ్ గుడ్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, బ్యాడ్ ఐపీఎస్, ఐఏఎస్ అధికారులతో సమావేశమవుతారు. ఆ సన్నివేశంలో బ్యాడ్ ఐఏఎస్ అధికారిగా వెంకట్ కనిపించారు. అలాగే ఎస్పీ సూర్యతో కలిసి ఒక సన్నివేశంలో ఉన్నారు. దీంతో భీమిలిలో ఆయన పరిచయస్తులు, తెలిసిన వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ సన్నివేశాల కోసం వెంకట్ మూడు రోజుల పాటు హైదరాబాద్‌లో జరిగిన షూటింగ్‌లో పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా భోగి పండుగ


వైశాఖి పార్కు, వేడుకల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు


పార్కు ప్రాంగణంలో పులి వేషాలు


జనసేన కార్యాలయం వద్ద తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

మాధవధార, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉత్తర నియోజకవర్గం పరిధిలోని మురళీనగర్, మాధవధార జంట కాలనీల్లో సోమవారం భోగి పండుగ వేడుకలు ఉత్సాహంగా జరిగాయి. వేకువ నుంచే కాలనీ వీధుల్లో భోగి మంటలు వేసి, ప్రజలు సంప్రదాయాన్ని చాటారు. దాదాపు ప్రతి ఇంటా చక్కని రంగవల్లులు, కాలనీ వాసులంతా కలసి ఓ చోట భోగి మంటల వద్ద సామూహికంగా వేడుకలు నిర్వహించారు. మాధవధార ఉడాకాలనీ నివాసితుల సంక్షేమ సంఘం, మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ సంక్షేమ సంఘం సహా ప్రసిద్ధ ఆలయాలైన మురళీనగర్ ఎన్‌జీజీఓస్ కాలనీ వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయం, ఆర్‌అండ్‌బీ భూసమేత విజయ వేంటేశ్వర స్వామి ఆలయం, గాంధీనగర్ రామాలయాల్లో శాస్త్రోక్తంగా భోగి వేడుకలు నిర్వహించారు. మురళీనగర్ వైశాఖీ స్పోర్ట్సు పార్కులో జరిగిన సంబరాలు అంబరాన్నంటాయి. ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్ రాజు వేడుకల్లో పాల్గొని మాట్లాడుతూ మన సంప్రదాయాల్ని ఇలాగే కాపాడుతూ, భావితరానికి తెలుగుదనం మజా చూపాలన్నారు. పార్కులో భోగి మంటలు, హరిదాసు కీర్తనలు ఆకట్టుకున్నాయి. గంగిరెద్దులు, పులి వేషాలతో పార్కు కమిటీ అధ్యక్షుడు వరప్రసాద్, కార్యదర్శి పి.వి.ఎస్.ఎన్.రాజు, పాలకవర్గ సభ్యులు కాలనీ వాసులకు సౌకర్యాలు కల్పించారు.

జనసేన కార్యాలయంలో..

సీతంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సీతంపేట రాజేంద్రనగర్‌లోని జనసేన పార్టీ నగర కార్యాలయంలో సోమవారం భోగి, సంక్రాంతి, కనుమ వేడుకలు వైభవంగా నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా భోగి మంట వేసి వేడుకలను దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే, జనసేన నగర అధ్యక్షుడు వంశీకృష్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. తెల్లవారు జాము అయిదు గంటలకే పార్టీ కార్యాలయానికి చేరుకున్న శ్రేణులు ఆనందోత్సాహాలు, కేరింతలతో నృత్యం చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తప్పెటగుళ్ల ప్రదర్శన, డూడూ బసవన్నలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ కార్యక్రమంలో జనసేన మహిళ సమన్వయకర్త అమరావు దుర్గ, నాగలక్ష్మి, కిరణ్ ప్రసాద్, సమన్వయకర్త శివప్రసాద్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ నారా అమ్మాజీ, వార్డు అధ్యక్షుడు గుండు సురేష్‌బాబు, చంటి, అంగటి శ్రవణ్, బోగిల శ్రీనివాస్ పట్నాయక్, వీరమహిళలు పాల్గొన్నారు.

విద్యార్థినుల ఆనందహేల

మహారాణిపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆనందోత్సాహాల మధ్య విద్యార్థినులు సంక్రాంతి వేడుకలు జరుపుకొన్నారు. సోమవారం ఇక్కడి ఓ కళాశాలలో సంక్రాంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా సంప్రదాయ దుస్తులు ధరించి ముగ్గులు వేశారు. డూడూ బసవన్నలు, హరిదాసు, గొబ్బెమ్మల ప్రదర్శనతో సందడి చేశారు. విద్యార్థులు భోగి మంట వేశారు. అనంతరం పతంగులను పోటాపోటీగా ఎగురవేశారు. అందరూ కలిసి పాటలు పాడుతూ, నృత్యాలతో పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని ఉల్లాసంగా గడిపారు. విద్యార్థినులు తీర్చిదిద్దిన రంగవల్లులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం కళాశాల కరస్పాండెంట్ రవిశంకర్‌వర్మ, ప్రిన్సిపాల్ సత్యనారాయణలు వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు


మహారాణిపేటలో భోగి మంట చుట్టూ సందడి చేస్తున్న విద్యార్థినులు

అలరించిన ముగ్గుల పోటీలు

» మొదటి ముగ్గురు మహిళా విజేతలకు నగదు బహుమతి ప్రదానం


వన్‌టౌన్ కొత్తరోడ్డులో ఏర్పాటు చేసిన ముగ్గుల పోటీల్లో మహిళలు వేస్తున్న రంగవల్లికలు

జగదాంబ కూడలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): చుక్కలు, గీతల ముగ్గులను రంగుల్లో తీర్చిదిద్దిన మహిళలు నేలకు సరికొత్త కళ తెచ్చారు. ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు, ముగ్గులు తిలకించేందుకు వచ్చిన ఎమ్మెల్యే వంశీకృష్ణ, పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మహిళల నైపుణ్యాన్ని చూసి అచ్చెరువొందారు. వన్‌టౌన్ మెయిన్ రోడ్డుపై వేసిన ముగ్గులు చూసి న్యాయనిర్ణేతలు, స్థానికులు ఆనందం వ్యక్తంచేశారు. సంక్రాంతి సంబరాల్లో భాగంగా ఆదివారం కొత్త రోడ్డు వద్ద నిర్వహించిన ముగ్గుల పోటీలో దాదాపు 350 మంది మహిళలు పాల్గొన్నారు. వీరిలో ప్రథమ బహుమతి లక్ష్మీదేవి, ద్వితీయ బహుమతి మంగ, తృతీయ బహుమతి పద్మావతి అనే మహిళ గెలుచుకున్నారు. విజేతలకు దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ నగదు బహుమతిని అందజేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినవారికి వరుసగా రూ.50 వేలు, రూ.30 వేలు, రూ.20 వేలు అందజేశారు. విజేతలను ఎమ్మెల్యే వంశీకృష్ణ, నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి అభినందించారు.


మొదటి బహుమతి విజేత లక్ష్మీదేవికి నగదు బహుమతి అందజేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి, ఎమ్మెల్యే వంశీకృష్ణ

సంప్రదాయాలను కాపాడుకోవాలి

డాబాగార్డెన్స్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మన సంస్కృతి సంప్రదాయాలను గౌరవించుకోవాల్సిన అవసరం ఉందని దక్షిణ నియోజకవర్గం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. సోమవారం తెల్లవారు జామున డాబాగార్డెన్స్, జగదాంబ, ప్రకాశ్‌రావుపేట డౌన్ తదితర ప్రాంతాల్లో భోగి మంటల దగ్గర ఉల్లాసంగా గడిపారు. పల్లె వాతావరణాన్ని ప్రజలకు తెలియజేసేందుకు రంగవల్లుల పోటీ నిర్వహించినట్లు ఎమ్మెల్యే చెప్పారు. చెడును అంతం చేయడమే భోగి పండుగ ప్రత్యేకత అని ఎమ్మెల్యే వంశీకృష్ణ పేర్కొన్నారు.

అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొంటే చర్యలు: సీఐ హెచ్చరిక


సూచనలు చేస్తున్న సీఐ రమణ

సీతమ్మధార, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాతి పండుగ నేపథ్యంలో కోడి పందాలు, పేకాట, గుండాట తదితర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం, పాల్గొనడం చట్టరీత్యా నేరమని ద్వారకా పోలీసు స్టేషన్ సీఐ రమణ అన్నారు. ప్రజలు ఇలాంటి కార్యక్రమాల్లో పాల్గొని ఆస్తులను నష్టపోవద్దని సూచించారు. ఇలాంటి కార్యకలాపాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే 112 నెంబరుకు, నగర పోలీసు కమిషనర్ 79950 95799, లేదా సమీప పోలీసు స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సీఐ రమణ కోరారు.

అంధుల మహిళల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర శుభారంభం



ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంటున్న ఆంధ్ర క్రికెటర్ రమ్య

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జాతీయ అంధుల మహిళల క్రికెట్ టోర్నీలో ఆంధ్ర జట్టు శుభారంభం చేసింది. కొచ్చిన్‌లో సోమవారం జరిగిన తొలిమ్యాచ్‌లో ఆంధ్ర 51 పరుగుల తేడాతో న్యూఢిల్లీపై విజయం సాధించింది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన ఆంధ్ర జట్టు నిర్ణీత 20 ఓవర్లలో ఎనిమిది వికెట్లకు 142 పరుగులు చేసింది. రవని (24), రమ్య (20) రాణించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన న్యూఢిల్లీ 92 పరుగులకు ఆలౌటై ఓటమి చెందింది. ఆల్ రౌండర్ ప్రతిభ చూపిన ఆంధ్ర క్రికెటర్ రమ్య ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ అవార్డు అందుకుంది.

వసతి గృహానికి మహిళ తరలింపు


ఆర్పీఎఫ్ సిబ్బందితో దమయంతి

అక్కయ్యపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వైజాగ్ రైల్వేస్టేషన్‌లో దిక్కుతోచని స్థితిలో ఉన్న బరంపురం ప్రాంతానికి చెందిన చౌదరి దమయంతి (70)ని టీఎస్సార్ కాంప్లెక్స్‌లోని నిరాశ్రయుల వసతిగృహంలో ఆశ్రయం కల్పించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. ఆమె నర్సుగా పనిచేసి రిటైర్ అయ్యారని, పింఛన్ రూ.43 వేలు వస్తున్నాయని చెప్పారు. రెండు రోజుల క్రితం ఆమె కాశీ వెళ్లి వస్తూ వైజాగ్ రైల్వేస్టేషన్‌లో దిగిపోయిందని, ఆర్పీఎఫ్ సిబ్బంది తమకు సమాచారమిచ్చారని, ఆమె దగ్గర ఉన్న రూ.7 వేలు, సెల్‌ఫోన్ రైల్వేస్టేషన్‌లోనే పోగొట్టుకుందని తెలిపారు. దమయంతికి ఇద్దరు కుమారులు, కూతుళ్లు ఉన్నారన్నారు. ఆమె మనవడు ఫోన్ నెంబరు తీసుకొని కుటుంబ సభ్యులకు అప్పగించనున్నట్లు చెప్పారు.

నేత్రపర్వంగా గోదాదేవి కల్యాణం

అల్లిపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అల్లిపురం వేంకటేశ్వర మెట్టపై వేంచేసిన వేంకటేశ్వర దేవస్థానంలో భోగి పండుగ సందర్భంగా సోమవారం గోదాదేవి కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. ఆలయ మండపంలో గోదాదేవికి రంగనాయకకు కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య సంప్రదాయబద్ధంగా ఈ కల్యాణాన్ని గోవింద నామస్మరణ మధ్య అత్యంత ఘనంగా నిరహించారు. గోదాదేవి రంగనాయకకు భక్తులు పట్టువస్త్రాలు, చీరలు అందజేశారు. ఆలయ అర్చకుడు గొడవర్తి రామవాచారి, గొడవర్తి రామచంద్రాచార్యులు ఈ కల్యాణాన్ని నయనానందకరంగా జరిపించారు. ఆలయ ఈవో జీవీ రమాబాయి పర్యవేక్షణలో కల్యాణాన్ని వైభవంగా నిర్వహించగా అనంతరం భక్తులకు అన్న సమారాధన జరిపారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

విశాఖ-చర్లపల్లి మధ్య సంక్రాంతి ప్రత్యేక రైలు

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి ప్రయాణికుల సౌకర్యార్థం విశాఖ, చర్లపల్లి మధ్య ఒక ట్రిప్పు (రాను పోను) ప్రత్యేక రైలు ప్రవేశపెట్టామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. 08523 నంబరు గల రైలు మంగళవారం సాయంత్రం 6.20 గంటలకు విశాఖలో బయలుదేరి మరునటి రోజు ఉదయం 7.30 గంటలకు చర్లపల్లి చేరుతుంది. తిరుగు ప్రయాణంలో 08524 నంబరుతో రైలు ఈ నెల 15న ఉదయం 10 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి రాత్రి 10.20 గంటలకు విశాఖ చేరుతుంది. ఈ సర్వీసులు నాలుగు సెకెండ్ ఏసీ, రెండు థర్డ్ ఏసీ ఎకానమీ, ఎనిమిది స్లీపర్, నాలుగు జనరల్ సెకెండ్ క్లాసు, ఒక సెకెండ్ క్లాసు కమ్ లగేజి కమ్ దివ్యాంగుల కోచ్‌లు ఉంటాయన్నారు.

రైతుబజార్ కిటకిట

సీతమ్మధార, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సీతమ్మధార రైతుబజార్ సోమవారం కొనుగోలుదారులతో ఉదయం నుంచి రాత్రి వరకు కిటకిటలాడింది. మంగళవారం సంక్రాంతి రోజు బజార్‌క సెలవు కావడంతో జనం పూజా సామగ్రి కొనుగోలు చేయడానికి పెద్ద సంఖ్యలో వచ్చారు. కొబ్బరికాయలు, అరటి పండ్లు, పూలదుకాణాల వద్ద రద్దీ నెలకొంది.

కబడ్డీ టోర్నీ చాంప్ విశాఖ


క్రీడాకారులను అభినందించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్

విశాఖపట్నం స్పోర్ట్సు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి సీనియర్ కబడ్డీ టోర్నీలో విశాఖ పురుషులు, మహిళల జట్టు చాంపియన్‌గా నిలిచాయి. కర్నూలులో జరిగిన టోర్నీ ఫైనల్స్‌లో మహిళల జట్టు ఆతిథ్య కర్నూలుపై పది పాయింట్ల తేడాతో పురుషుల జట్టు కర్నూలుపై 12 పాయింట్ల తేడాతో విజయం సాధించి చాంపియన్ ట్రోఫీలను కైవసం చేసుకున్నాయి. ఈ సందర్భంగా దక్షిణ నియోజకవర్గ శాసనసభ్యుడు వంశీకృష్ణ శ్రీనివాస్ సోమవారం తన కార్యాలయంలో విజేతలను అభినందించి జాతీయ స్థాయి టోర్నీలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కబడ్డీ సంఘం ప్రతినిధులు ఉరుకూటి శ్రీనివాస్, ఉమాశంకర్ బాబు, వి.బాబూరావు, గణపతిరావు, కోటేశ్వరరావు, ప్రకాష్, పి.సత్యనారాయణ, కోచ్ వసంత్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యం అధ్వానం


ఆంధోనీ నగర్‌లో వ్యర్థాలు ఇలా...

మహారాణిపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక 29వ వార్డులో పారిశుధ్యం అధ్వానంగా ఉంది. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది విధి నిర్వహణలో నిర్లక్ష్యం కారణంగా వార్డులో ఎక్కడ చూసినా చెత్తనిల్వలు పేరుకుపోయాయి. కనీసం పండుగ రోజుల్లో కూడా సిబ్బంది సక్రమంగా విధులు నిర్వహించకపోవటంతో చెత్త నిల్వలు పేరుకుపోయి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. దండుబజారు, ఆంధోనీనగర్, అంగటిదిబ్బ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య లోపం కనిపిస్తోంది. చెత్త నిల్వలతో దోమలు విజృంభించడంతో ప్రజలు మండిపడుతున్నారు. అసలే తీవ్రమైన డెంగ్యూ, మలేరియా వైరల్ విషజ్వరాలతో ప్రజలు అల్లాడుతూ ఉంటే పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేకపోవటం గమనార్హం. ప్రజారోగ్య శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్తబ్దుగా రియల్ వ్యాపారం

... 7వ పేజీ తరువాయి

తగ్గించడం లేదు. ఈరోజు కాకపోతే రేపు అమ్ముకున్నా మంచి ధర వస్తుందని వేచి చూస్తున్నారు. దీంతో లావాదేవీలు జరగడం లేదు.

అరకొరగా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు

చాలామంది విశాఖలో ప్లాటు కొనాలంటే... సొంత ఊళ్లోనో.. మరోచోటో ఉన్న స్థిరాస్తిని అమ్మి, ఆ మొత్తానికి మరికొంత బ్యాంకు రుణం జోడించాల్సి వస్తోంది. అలా ఒకటీ అరా ప్లాట్ల రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. కృత్రిమ డిమాండ్ వల్ల రేట్లు పెరిగిపోయాయి. ఒకసారి పెంచితే తగ్గించే అలవాటు లేకపోవడం వల్ల మధ్య తరగతి ప్రజలు కొనలేని పరిస్థితి వచ్చింది.

- జి.బాలకృష్ణ, డీఐజీ, రిజిస్ట్రేషన్ల శాఖ

సంబరంగా భోగి

... 7వ పేజీ తరువాయి

భోగి మంట వేశారు. బీచ్‌రోడ్డులో గో ఆధారిత ప్రకృతి వ్యవసాయదారుల సంఘం ఆధ్వర్యంలో దేశీయగోవు పేడతో తయారుచేసిన లక్ష పిడకలతో బీచ్‌రోడ్డులోని వైఎంసీఏ ఎదుట భోగిమంట వేశారు. తారురోడ్లపై భోగి మంటలు వేయవద్దని జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ చేసిన విజ్ఞప్తిని ప్రజలు పట్టించుకోకుండా రహదారులపైనే మంటలు వేసి సంబరాలు చేసుకున్నారు.

వైసీపీ సానుభూతిపరులదే హవా!

... 7వ పేజీ తరువాయి

ఉండడంతో లబ్ధిదారులు నిర్మాణానికి ముందుకు రాలేదు. దీంతో హౌసింగ్ కార్పొరేషన్ ప్రమేయంతో అనధికారికంగా పలువురు కాంట్రాక్టర్లకు నిర్మాణాల బాధ్యత అప్పగించారు. ప్రధానంగా నెల్లూరు, అనంతపురం జిల్లాలకు చెందిన వైసీపీ అనుకూల కాంట్రాక్టర్లే ఎక్కువ పనులు తీసుకున్నారు. వీరికి హౌసింగ్ అధికారులు అధిక ప్రాధాన్యతనిస్తూ రెడ్‌కార్పెట్ పరిచారు. మెటీరియల్ సరఫరాలో ప్రాధాన్యత ఇచ్చి, బిల్లుల మంజూరు ఆగమేఘాలపై ఫైళ్లు కదిపారు. ఇంతచేసినా గత ప్రభుత్వంలో అనంతపురంలోని ఓ వైసీపీ ఎమ్మెల్యేకి చెందిన రాక్‌ట్రీ ఇన్‌ఫ్రా సంస్థ ఇళ్ల నిర్మాణంలో చతికిలబడింది. అయినా ఈ సంస్థకు అధికంగా బిల్లులు చేసిన అధికారులు వైసీపీపై భక్తిభావంచాటుకున్నారు.

ప్రభుత్వం మారినా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా వైసీపీ మద్దతుదారులైన కాంట్రాక్టర్ల హవా కొనసాగుతోంది. వారు చెప్పిందే హౌసింగ్ కార్యాలయంలో జరుగుతోందనే వాదన ఉంది. అధికారులు వారికి ఎనలేని ప్రాధాన్యత ఇస్తూ చిన్న కాంట్రాక్టర్లను నిర్లక్ష్యం చేస్తున్నారనే ఆరోపణలున్నాయి. కాగా పనులు చేపట్టాలని నాలుగు నెలల కొందట ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కాంట్రాక్టర్లు నిర్మాణాలు ప్రారంభించారు. పనులుచేసిన వెంటనే ఎం.బుక్‌లో వివరాలు నమోదు చేయడంలో పెద్ద కాంట్రాక్టర్లకే అధికారులు ప్రాధాన్యత ఇస్తున్నారు. బిల్లులు మంజూరు చేయడంలోనూ ఆగమేఘాల మీద పనిచేస్తున్నారు. వారు కోరిన మేరకు ఇసుక సరఫరా చేస్తున్న అధికారులు, చిన్న కాంట్రాక్టర్లను పక్కన పెట్టేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై ఓ కాంట్రాక్టరు నేరుగా ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారని తెలిసింది. తన పేరు బయటకు వస్తే వేధింపులకు దిగుతారనే అనుమానంతో వివరాలు చెప్పడానికి వెనుకాడారు.

ఇప్పటికీ వైసీపీ సేవలోనే...

జిల్లా హౌసింగ్ కార్యాలయంలో గతంలో పనిచేసిన ఉన్నతాధికారి నెల్లూరు కాంట్రాక్టర్లకు అనుకూలంగా ఉండేవారని, ఇందుకు గాను ఓ కారు బహుమతిగా అందుకున్నారని సిబ్బందే గుసగుసలాడుతున్నారు. ఆ తరువాత వచ్చిన అధికారులు కూడా వైసీపీ అనుకూలురుకే పని చేసి పెడుతున్నారని చెబుతున్నారు. పెద్ద కాంట్రాక్టర్లకు సరఫరా చేసిన ఇసుక నుంచి కొన్ని లారీలను పక్కదారి పట్టించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నగరం... నిర్మానుష్యం

... 7వ పేజీ తరువాయి

చెందినవారే. ఏడాదంతా ఉద్యోగం, వ్యాపారం ఇతర వ్యాపకాల్లో బిజీగా గడిపినవారంతా సంక్రాంతికి స్వస్థలాలకు వెళ్లి సంక్రాంతిని జరుపుకోవడానికి ఆసక్తిచూపుతారు. విద్యా సంస్థలకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 11 నుంచి 19 వరకూ సెలవులు ప్రకటించింది. దీంతో చాలామంది ఈనెల 11 నుంచే ప్రయాణాలు పెట్టుకున్నారు. ప్రైవేటు సంస్థల్లో పనిచేసే వారు, వ్యాపారులు, స్వయం ఉపాధి చేసుకునే వారు, కూలిపనులు చేసుకునేవారు మాత్రం ముందుగా వెళ్లేందుకు అవకాశం లేకపోవడంతో ఆది, సోమవారాల్లో స్వస్థలాలకు పయనమయ్యారు. మిగిలిపోయినవారు భోగి పండగను సోమవారం నగరంలోనే జరుపుకుని బయలుదేరారు. దీనివల్ల మధ్యాహ్నం 12 గంటల వరకు అనకాపల్లి, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే మార్గాలపై వాహనాల రద్దీ కనిపించినా తర్వాత పూర్తిగా తగ్గిపోయింది. నిత్యం వాహనాల రద్దీ, ట్రాఫిక్ జామ్‌తో పద్మవ్యూహాన్ని తలపించే హనుమంతవాక కూడలి, వెంకోజీపాలెం, ఇసుకతోట, ఎంవీపీకాలనీ, సత్యం జంక్షన్, జగదాంబ జంక్షన్, ద్వారకానగర్, గాజువాక వంటి ప్రధాన కూడళ్లు రద్దీ లేకపోవడంతో కళా విహీనంగా మారాయి. ద్వారకనగర్, ఆశీల్‌మెట్ట నుంచి జగదాంబ రోడ్డు, ఆర్టీసీ కాంప్లెక్స్‌నుంచి డాబా గార్డెన్స్ రోడ్డులో వాహనాల రాకపోకలు తగ్గిపోయాయి. నగరంలో ఉదయం ఎనిమిది నుంచి పది గంటల వరకు, సాయంత్రం నాలుగు నుంచి రాత్రి ఎనిమిది గంటలు వరకూ విపరీతమైన ట్రాఫిక్ ఉంటుంది. ఒక్కో కూడలి వద్ద ట్రాఫిక్ సిగ్నల్ పడితే వాహనాలు కిలోమీటరు పొడవునా బారులుతీరిపోతాయి. కానీ సోమవారం నగరంలో పరిస్థితి దీనికి పూర్తివిరుద్ధంగా కనిపించింది. ట్రాఫిక్ సిగ్నల్ వద్ద రెడ్‌సిగ్నల్‌పడినా పదిలోపు వాహనాలు మాత్రమే ఆగిఉంటున్నాయి.

సాధారణంగా సెలవురోజుల్లో కోలాహలంగా కనిపించే బీచ్, జూపార్కు సందర్శకుల తాకిడిలేకపోవడంతో ఖాళీగా కనిపించాయి. తప్పనిసరి పరిస్థితిలో నగరంలోనే పండగ జరుపుకునేందుకు ఉండిపోయినవారు మాత్రం బీచ్‌కు వెళ్లి గాలిపటాలు ఎగరవేస్తూ కాలక్షేపం చేశారు. రాత్రికాగానే వారంతా తిరిగి ఇళ్లకు చేరిపోవడంతో బీచ్ నిర్మానుష్యంగా మారిపోయింది. ఊరెళ్లినవారంతా సంక్రాంతి, కనుమ పండగలను స్వస్థల్లాలో జరుపుకున్న తర్వాతే తిరిగి వస్తారు కాబట్టి అంతవరకూ నగరంలో ఇదే పరిస్థితి కొనసాగుతుందని అంచనా.

సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌పై జీవీఎంసీ యుద్ధం

... 7వ పేజీ తరువాయి

ప్లాస్టిక్ ఎక్కడ అందుబాటులో ఉందో సమాచారం స్ర్కీన్‌పై కనబడుతుంది. సింగిల్‌యూజ్ ప్లాస్టిక్ విక్రయించినా, వినియోగదారులకు అందజేసినా వీధివ్యాపారులకైతే మొదటిసారి రూ.2,500, రెండోసారి పట్టుబడితే రూ.ఐదు వేలు జరిమానా విధిస్తామని, మూడోసారి పట్టుబడితే క్రిమినల్ కేసులు నమోదుచేసే అవకాశాలను పరిశీలిస్తామని హెచ్చరించారు. దుకాణాలు, వ్యాపారసంస్థలు సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్‌ను వాడుతూ మొదటిసారి పట్టుబడితే రూ.25వేలు, రెండోసారి పట్టుబడితే రూ.40వేలు జరిమానా. మూడోసారి పట్టుబడితే ట్రేడ్‌లైసెన్స్ రద్దుచేసి వారి కుటుంబంలో మరెవరికీ లైసెన్స్ ఇవ్వకుండా నిషేధం విధిస్తామని కమిషనర్ ప్రకటించారు. అయితే మరో నెలరోజులపాటు అవగాహన కల్పించడం, దుకాణాలపై దాడులు చేసి సింగిల్‌యూజ్‌ప్లాస్టిక్ ఉంటే సీజ్‌చేయడంతో సరిపెట్టాలని వెసులుబాటు కల్పించారు. ఫిబ్రవరి నుంచి జరిమానా విధిస్తామన్నారు. దీంతో ప్రత్యేక బృందాలు ఇప్పటివరకు సుమారు 500 దుకాణాలపై దాడులు చేసి ఆరు టన్నుల సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను సీజ్‌చేసినట్టు కమిషనర్ తెలిపారు.

కేజీహెచ్‌లో మరో రెండు డయాలసిస్ సెంటర్లు

... 7వ పేజీ తరువాయి

సిద్ధమవుతున్నారు. కొద్దిరోజుల్లోనే ఈ సేవలు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్టు చెబుతున్నారు.

ప్రతి రోజూ 50 మందికి సేవలు..

ప్రస్తుతం కేజీహెచ్‌లో ప్రతిరోజూ 50 మందికి డయాలసిస్ సేవలు అందిస్తున్నారు. నెఫ్రాలజీ విభాగంలోని పది డయాలసిస్ యంత్రాలతో ఉన్న సెంటర్‌లో ప్రతిరోజూ 20 మందికి సేవలు అందుతుండగా, సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లోనే నెఫ్రోప్లస్ అనే సంస్థ ద్వారా ప్రత్యేకంగా రోజుకు 30 మదికి డయాలసిస్ సేవలందిస్తున్నారు. నెఫ్రోప్లస్‌లో అందించే సేవలకు ఓపీ విధానంలో రోగులు డయాలసిస్ చేయించుకుని వెళ్తుంటారు. కాగా వార్డులో ఇన్‌పేషెంట్లు, ఇతర విభాగాల నుంచి వచ్చే వారికి సేవలందిస్తారు. ఇతర విభాగాల్లో ఇన్‌పేషెంట్లుగా చేరిన రోగులను ఇక్కడకు తీసుకువచ్చి సేవలు అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని గుర్తించిన అధికారులు ప్రత్యామ్నాయంగా ఈ రెండు వార్డుల్లో డయాలసిస్ సేవలు అందించేందుకు సిద్ధమవుతున్నారు.

ఆశాజనకం

... 7వ పేజీ తరువాయి

వసూలైంది. గత ఏడాదితో పోల్చితే ఈసారి రూ.31 కోట్లు అధికంగా వసూలు చేయడంతో మిగిలిన రూ.169 కోట్ల వసూలుకు కార్యాచరణ రూపొందించుకుని అమలుచేస్తున్నారు.

బకాయిలపైనా ప్రత్యేక దృష్టి

నగర పరిధిలో ఆస్తిపన్ను వసూళ్లతోపాటు కోర్టు కేసులపేరుతో పెండింగ్‌లో ఉండిపోయిన బకాయిల వసూళ్లపై జీవీఎంసీ కమిషనర్ పి.సంపత్‌కుమార్ ప్రత్యేకంగా దృష్టిపెట్టారు. కోర్టులో కేసులు వేసినవారితో స్వయంగా మాట్లాడుతున్నారు. లేదంటే రెవెన్యూ అధికారులను పంపి చర్చలు జరిపిస్తున్నారు. ఈ సందర్భంగా కేసు విత్‌డ్రా చేసుకునేలా ఒప్పిస్తున్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పరిధిలో ఉన్న సంస్థల నుంచి పెండింగ్ బకాయిలను రాబట్టేలా ఆయాశాఖల ఉన్నతాధికారులతో చర్చలు జరుపుతున్నారు. దీనివల్ల పెండింగ్ బకాయిలు కూడా జీవీఎంసీ ఖాతాకు జమవుతున్నాయి. మరోవైపు ప్రతి వారం రెవెన్యూ విభాగంపై సమీక్షలు నిర్వహించి జోన్‌ల వారీగా పన్ను వసూళ్లపై ఆరాతీస్తున్నారు. మరోవైపు కమిషనర్ ఆదేశాలతో డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) ఎస్.శ్రీనివాసరావు ప్రతిరోజూ ఏదో ఒక జోన్‌లో భారీమొత్తంలో ఆస్తిపన్ను బకాయి ఉన్న అసెస్‌మెంట్‌లకు వెళ్లి అధికారులు/ ప్రైవేటు ఆస్తి యజమానులతో మాట్లాడి పన్ను చెల్లించేలా ఒప్పించడం, అసెస్‌మెంట్‌ల వారీగా తనిఖీలు చేస్తున్నారు. ఎవరికైనా అసెస్‌మెట్ జారీచేయకపోయినా, జాప్యం జరిగినా సంబంధిత వార్డు టాక్స్‌కలెక్టర్లు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లను నిలదీయడంతోపాటు చర్యలకు కమిషనర్‌కు సిఫార్సు చేస్తున్నారు. దీంతో పన్ను వసూళ్లు ఆశించిన స్థాయిలో పెరిగాయని ఆ విభాగం సిబ్బంది చెబుతున్నారు.



నితీశ్‌కు పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలుపుతున్న కాలనీవాసులు

క్రికెటర్ నితీశ్‌కు అభినందనలు

అక్కిరెడ్డిపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా గడ్డపై జరిగిన ఇటీవల జరిగిన క్రికెట్ టెస్ట్ సిరీస్‌లో అద్భుతమైన సెంచరీతో అందరినీ ఆకట్టుకున్న తుంగ్లాం యువకుడు కాకి నితీశ్‌కుమార్‌రెడ్డిని తుంగ్లాం కాలనీవాసులు సోమవారం కలిసి అభినందనలు తెలిపారు. నగరంలో ఉంటున్న నితీశ్‌ను 69వ వార్డు కూటమి నాయకుడు కరణం ముత్యాల నాయుడు ఆధ్వర్యంలో కాలనీవాసులు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. క్రికెట్‌లో మరింత రాణించి దేశంతో పాటు తుంగ్లాం గ్రామానికి మంచి గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు.

రెల్లి సామాజిక వర్గ రాష్ట్ర అధ్యక్షుడిగా రవికుమార్



సింధియా, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా పాలకొండలో ఇటీవల జరిగిన రాష్ట్ర రెల్లి సామాజిక వర్గ సమావేశంలో జీవీఎంసీ 63వ వార్డు పరిధి జైఆంధ్ర కాలనీకి చెందిన చెందిన కొట్నాల రవికుమార్ రాష్ట్ర రెల్లి కుల అభివృద్ధి సంఘం అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర రెల్లి కుల స్థితిగతుల పట్ల అవగాహన ఉన్న నాయకునిగా తనను గుర్తించి ఈ అవకాశం కల్పించిన సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. రెల్లి సామాజిక వర్గ ప్రజల అభ్యున్నతి కోసం నిరంతరం కృషి చేస్తానన్నారు. గతంలో తాను రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, రెల్లి ఇంటెలెక్చువల్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడిగా, స్థానిక పారిశ్రామిక ప్రాంత రెల్లి కులాల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడిగా సేవలందించానన్నారు.

లంకా మైదానంలో పల్లె వాతావరణం

గాజువాక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో సంక్రాంతి సంబరాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. లంకా మైదానంలో ప్రారంభించిన సంక్రాంతి సంబరాల్లో భాగంగా సోమవారం ఉదయం భోగి మంట వేశారు. అనంతరం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించడంతో పాటు గోదాదేవి కల్యాణాన్ని జరిపారు. సాయంత్రం రేలారేలా, డ్యాన్స్ షోలు అందరినీ ఆకట్టుకున్నాయి. పల్లె వాతావరణం కళ్లకు కనిపించేలా వేడుకలు నిర్వహించారు. మరో మూడు రోజుల పాటు వేడుకలు నిర్వహిస్తామని ప్రతినిధులు పేర్కొన్నారు.

సినిమా గైడ్

● **సంక్రాంతికి వస్తున్నాం:** శ్రీలీలామహల్, శారద, శ్రీరామ, మెలోడి, జగదాంబ, సంగం, కామేశ్వరి, కిన్నెర, గోకుల్, కాంతి, శ్రీలక్ష్మీనరసింహ-1,2 (104 ఏరియా), శ్రీనరసింహ (గోపాలపట్నం), శ్రీకన్య, మోహిని (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), అరుణ (పెదగంట్యాడ), తాతా, రాములమ్మ (తగరపువలస)

● **డాకు మహారాజ్:** జగదాంబ, శ్రీవెంకటేశ్వర, శరత్, శ్రీకన్య, కిన్నెర, శ్రీలక్ష్మీనరసింహ-1 (104 ఏరియా), సుకన్య, సౌజన్య (గోపాలపట్నం), మోహిని కాంప్లెక్స్, శ్రీకన్య హెవెన్ (గాజువాక), నటరాజ్-1 (పెందుర్తి), గణేష్, సప్తగిరి (తగరపువలస),

● **గేమ్ ఛేంజర్:** మెలోడి, సంగం, రమాదేవి, వెంకటేశ్వర, కామేశ్వరి, గోకుల్, శ్రీలక్ష్మీనరసింహ-2 (104 ఏరియా), ఊర్వశి (కంచరపాలెం), నరసింహ (గోపాలపట్నం), కన్య కాంప్లెక్స్, మోహిని కాంప్లెక్స్ (గాజువాక), లిఖిత (శ్రీహరిపురం), సీతారామయ్య (పరవాడ), నటరాజ్-2 (పెందుర్తి) రాములమ్మ (తగరపువలస)

రైతు బజార్‌లో ధరలు (కిలో)

ఉల్లిపాయలు 34, టమాటా 14, వంకాయలు (తెలుపు) 34, వంకాయలు (నలుపు) 52, బెండకాయలు 54, పచ్చిమిర్చి 46, కాకరకాయలు 46, బీరకాయలు 58, ఆనపకాయ 26, కాలీఫ్లవర్ 16, క్యాబేజి 18, క్యారెట్ 46, దొండకాయలు 50, బంగాళదుంపలు 26, అరటికాయ (పెద్దది)7, అల్లం (పాతది)48, మునక్కాడలు (కిలో) 110, బరబాటి 52, ముల్లంగి 26, నిమ్మకాయలు (కిలో) 65, గోరుచిక్కుడు 34 దోసకాయలు 30, వెల్లుల్లి (పెద్దవి) 340, కొబ్బరికాయ (పెద్దది) 25, బీన్స్(పెన్సిల్) 58, పొటల్స్ 80, కీరదోస 40, క్యాప్సికమ్ 50, పొట్లకాయ (పెద్దది) 28, చేమదుంపలు 48, చిలగడదుంపలు 44, కంద 76, దేముడుచిక్కుడు 76, గోరుచిక్కుడు 34, ఆగాకార దేశవాళి 100, ఆగాకర హైబ్రిడ్ 50, కూరపెండలం 46, బ్రకోలి 80, పనస పొట్టు 200, కొండఉసిరి 52, కరివేపాకు (కిలో) 60, కొత్తిమీర (పెద్దకట్ట) 25, పుదీన (కట్ట) 5, చుక్కకూర (కట్ట) 4, పాలకూర (కట్ట) 4, తోటకూర (కట్ట) 4, బూడిద గుమ్మడి 34, కర్రపెండలం 24, మామిడి అల్లం 64, బొప్పాయి 35, జామకాయలు (కిలో) 60.

కోడిగుడ్లు (నెక్) (వంద - రూ.లలో)	
విశాఖపట్నం	520
విజయనగరం	524
శ్రీకాకుళం	524

చికెన్ ధరలు (బ్యాగ్)	
రైతు ధర	112
లైవ్ ధర	132
విత్ స్కిన్	234
స్కిన్‌లెస్	244



టీడీపీ గాజువాక కార్యాలయంలో భోగి వేడుకల్లో పాల్గొన్న పల్లా శ్రీనివాసరావు, తదితరులు



తుంగ్లాం రామాలయం వద్ద వేసిన భోగి మంట వద్ద ప్రజలు

భక్తి శ్రద్ధలతో భోగి పండగ

గాజువాక, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గాజువాక పరిసర ప్రాంతాల్లో భోగి పండగను ప్రజలంతా ఎంతో ఆనందంగా జరుపుకున్నారు. పలుచోట్ల వేకువజామునే పెద్దఎత్తున మంటలు వేసి వాటి చుట్టూ చేరి ఉల్లాసంగా..ఉత్సాహంగా గడిపారు. ఇందులో భాగంగా ఇక్కడి టీడీపీ కార్యాలయంలో సోమవారం సంక్రాంతి సంబరాలను పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రారంభించారు. తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా వేడుకలు నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలో భోగి మంట వేశారు. అన్నదాతకు ప్రతీకగా పరమాన్నం వండి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతే లక్ష్యంగా సీఎం చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్ గంధం శ్రీనివాస్, నాయకులు విల్లా రామ్మోహన్‌కుమార్, నాగేశ్వరరావు, ఎ.దీప్తి, శివప్రసాద్, చట్టి గోపి. రాజన్‌రాజు, భవానీ, గీత, తదితరులు పాల్గొన్నారు.

అక్కిరెడ్డిపాలెం: భోగి పండగను పలు ప్రాంతాల్లో సోమవారం ప్రజలంతా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఇందులో భాగంగా 68, 69 వార్డుల్లోని పలు ప్రాంతాల్లో యువకులు, స్థానిక పెద్దలు వేకువజామునే భోగి మంటలు వేశారు. పలు అపార్టుమెంట్ల ముందు సంప్రదాయ దుస్తులు ధరించి నివాసితులు భోగి మంటలు వేసి పూజలు చేశారు. తుంగ్లాం కాలనీలోని విజయ రాఘవ స్వామి ఆలయం వద్ద కాలనీ నాయకులు ఏర్పాటు చేసిన భోగి మంటను కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి వెలిగించారు. అక్కిరెడ్డిపాలెం రామాలయం వద్ద డీవైఎఫ్ఐ కాలనీ నాయకులు నిర్వహించిన సంక్రాంతి సంబరాలు మన సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచాయి. ఆలయం వద్ద మహిళలు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలను పెట్టి, చుట్టూ చెరకు గెడలను అమర్చి ప్రత్యేక పొయ్యిలు ఏర్పాటు చేసి పరమాన్నం తయారు చేశారు. అనంతరం భోగి మంట వేయగా.. మహిళలతో పాటు యువకులు, పెద్దలు పాటలు పాడుతూ చేపట్టిన కోలాటం అందరినీ ఆకట్టుకుంది. అలాగే స్నానాలు ఆచరించిన పలువురు చిన్నారులకు పెద్దలు భోగి పండ్లు వేసి ఆశీర్వదించారు.



భోగి మంట వేసిన స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు



అగనంపూడిలో భోగి వేడుకల్లో పాల్గొన్న స్థానికులు



అక్కిరెడ్డిపాలెంలో భోగి పండ్లు వేసి చిన్నారులను ఆశీర్వదిస్తున్న దృశ్యం

అగనంపూడి: గ్రేటర్ 79, 85వ వార్డుల పరిధి అగనంపూడి, ఉక్కు నిర్వాసిత గ్రామాలు, పార్మాసిటీ పునరావాస కాలనీలు, పరిసర ప్రాంతాల్లో సోమవారం భోగి పండగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నాలుగు గంటల నుంచే పలుచోట్ల భోగి మంటలు వేసి పూజలు చేశారు. స్థానిక జాబిలి హిల్స్ అసోసియేషన్, అభిరామ్ గృహ సముదాయాల వద్ద భోగిని పురస్కరించుకుని సంబరాలు జరిపారు. పలువురు మహిళలు భోగి మంటలు వేయడంతో పాటు రంగవల్లులు తీర్చిదిద్దారు.

ఉక్కుటౌన్‌షిప్: భోగి పండగను స్టీల్‌ప్లాంట్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. భోగి మంట వేసి స్టీల్‌ప్లాంటుకు మంచి రోజులు రావాలని, అధిక ఉత్పత్తి జరిగి, ఉద్యోగులు, కార్మికులకు మంచి జరగాలని పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86, 87, 88 పరిధిలోని పలు ప్రాంతాల్లో వేకువజామునే భోగి మంటలు వేసి ప్రజలు, స్థానిక నాయకులు చేశారు. ప్రధాన కూడళ్లతో పాటు కొన్ని అపార్టుమెంట్ల పెద్దఎత్తున మంటలు వేసి దానిచుట్టూ స్థానికులు సరదాగా గడిపారు.

పెదగంట్యాడ: మండల పరిధిలో భోగి వేడుకలను ప్రజలు ఆనందంగా నిర్వహించారు. తెల్లవారుజామునే పలు ప్రాంతాల్లో భోగి మంటలు మంటలు వేశారు. అన్ని వయసుల వారు మంటల వద్దకు చేరుకుని పూజలు చేశారు.



సభ్యత్వ నమోదులో పాల్గొన్న నల్లూరు, తదితరులు

టీడీపీ సభ్యత్వంతో భరోసా: నల్లూరు సూర్యనారాయణ

కూర్మన్నపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ సభ్యత్వం అంటే జీవితానికి భరోసా అని టీడీపీ 86వ వార్డు ఇన్‌చార్జి నల్లూరు సూర్యనారాయణ అన్నారు. వార్డు పరిధిలోని రాసాలమ్మ కాలనీలో సోమవారం టీడీపీ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఆదేశాల మేరకు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా సభ్యత్వ నమోదు చేపడుతున్నామన్నారు. ఇప్పటివరకు వార్డులో ఆరు వేలకు పైగా సభ్యత్వాలు చేశామన్నారు. కార్యక్రమంలో నాయకులు మాడిశ కనకరాజు, వేగుంట శ్రీనివాస్, జగదీష్, సుబ్బయ్య, వెంకటేశ్, నాగార్జున, రాధ, అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు మకర జ్యోతి దర్శనం

పెందుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర శబరిమలైగా పేర్గాంచిన పెందుర్తిలోని అయ్యప్పస్వామి ఆలయంలో మంగళవారం మకర సంక్రాంతి సందర్భంగా మకర జ్యోతి దర్శనం భక్తులకు లభిస్తుందని అయ్యప్ప సేవా ట్రస్ట్ తెలిపింది. ఉదయం పది గంటలకు మహాగణపతి హోమం, అయ్యప్పకు అష్టాభిషేకం, సాయంత్రం 6.15 గంటలకు దీపరాధాన, 6.40కు మకర జ్యోతి దర్శనం, 7 గంటలకు పడిపూజ మహోత్సవం నిర్వహిస్తామన్నారు.

పెందుర్తిలో సందడి

పెందుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతిని సంబరంగా జరుపుకునేందుకు జనం సిద్ధమయ్యారు. స్థానిక నాలుగురోడ్ల కూడలిలో మార్కెట్‌కు సోమవారం పండగ శోభ వచ్చింది. పలువురు పూజా సామగ్రి కొనుగోలు చేశారు. చెరకు గడలు, అరటి పండ్లు, కొబ్బరికాయలు, రంగుల విక్రయాలు జోరుగా సాగాయి. వస్త్ర దుకాణాలు కిటకిటలాడాయి.

కిటకిటలాడిన మార్కెట్లు



రద్దీగా ఉన్న గోపాలపట్నం మెయిన్ రోడ్

గోపాలపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండగ నేపథ్యంలో వారం రోజులుగా రద్దీగా ఉన్న మార్కెట్లకు సోమవారం కొనుగోలుదారుల తాకిడి తగిలింది. సాధారణంగా భోగి రోజు రద్దీ తగ్గుముఖం పడుతుంది. అయితే ఈ ఏడాది సోమవారం బజార్లు కిక్కిరిసాయి. ఉదయం నుంచి రాత్రి వరకూ ప్రధాన రహదారిలోని వ్యాపార సముదాయాలకు కొనుగోలుదారుల తాకిడి కనిపించింది. ఇక కూరగాయలు, పూజాసామగ్రి కొనుగోలు చేసేందుకు వచ్చిన వారితో రైతుబజారు కిక్కిరిసిపోయింది. వందలాదిగా తరలివచ్చిన వారితో రద్దీగా కనిపించింది.

రద్దీగా రైల్వేస్టేషన్

గోపాలపట్నం, జనవరి 13(ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో సింహాచలం రైల్వేస్టేషన్ సోమవారం కిక్కిరిసిపోయింది. విశాఖ-విజయనగరం, విశాఖ-రాయగడ, విశాఖ-పలాస పాసింజర్ రైళ్లతో పాటు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అసాధారణమైన రద్దీ కనిపించింది. సాధారణ రోజులతో పోలిస్తే మూడింతల మంది అధికంగా వచ్చారు. ప్రధానంగా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన వేలాది మంది స్వగ్రామాలకు వెళ్లడానికి చేరడంతో స్టేషన్ కిక్కిరిసిపోయింది. రైలు ప్లాట్‌ఫామ్‌కు వచ్చే సమయానికి బారులు తీరారు.

అభివృద్ధి పనులతో గ్రామాలకు సంక్రాంతి కళ

ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

పెందుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చేపట్టిన అభివృద్ధి పనులతో గ్రామాలకు ముందుగానే సంక్రాంతి కళ వచ్చిందని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు పేర్కొన్నారు. నియోజకవర్గంలో రూ. 25 కోట్లతో రహదారుల నిర్మాణం చేపట్టామన్నారు. మండలంలోని ఎస్‌ఆర్‌పురంలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా రూ.45 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైనేజీ అభివృద్ధి పనులను సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెందుర్తి మండలంలో రూ.5.5 కోట్ల వ్యయంతో రహదారుల నిర్మాణం చేపడుతున్నామన్నారు. అంతకుముందు ఎస్‌ఆర్‌పురంలో జనసేన నేత గొరపల్లి సోమునాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కోలాటంలో నృత్యం చేశారు. ముగ్గులను పరిశీలించి విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ మదుపాడ నాగమణి, జడ్పీటీసీ సభ్యులు ఉప్పిలి దేవి, సర్పంచ్ దూది విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అనంతరం సరిపల్లిలో సర్పంచ్ గొర్లె రామకృష్ణ ఆధ్వర్యంలో రూ.40 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. జంగాలిపాలెంలో సీసీ రోడ్డు డ్రైన్లు ప్రారంభించారు.



కోలాటంలో నృత్యం చేస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల



వేపగుంట : లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌లో భోగి మంట



గోపాలపట్నంలో భోగి మంట వద్ద జనాలు

వీధి వీధినా భోగి సందడి

వేపగుంట/ ఎన్ఏడీ జంక్షన్: జీవీఎంసీ 90వ వార్డు 52వ వార్డు పరిధిలో సోమవారం భోగి పండగను ఇంటింటా ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున ఇళ్లు, కాలనీ జంక్షన్‌లలో భోగి మంటలు వేశారు. విమాన్‌నగర్, కాకానీనగర్, శాంతినగర్, కరాస ప్రాంతాల్లో అపార్టుమెంటు వాసులు ఉత్సాహంగా వేడుకలు జరిపారు. నాయుడుతోట, వేపగుంట, ప్రహ్లాదపురం, అప్పనపాలెం పరిసర ప్రాంతాల్లో సామూహిక భోగి మంటలు వేశారు.

పెందుర్తి : భోగి పండగను మండలంలో వేడుకగా జరుపుకున్నారు. పెందుర్తి, చినముషిడివాడ, సుజాతనగర్‌లో సామూహిక భోగి మంటలు వేసి సందడి చేశారు గ్రామీణ ప్రాంతాల్లో భోగి సంప్రదాయబద్ధంగా జరిగింది.

మల్కాపురం : పారిశ్రామిక ప్రాంతంలో భోగి పండగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. తెల్లవారుజాము నుంచి వీధుల్లో పెద్దఎత్తున మంటలు వేశారు. యువకులు మేలుకొల్పులు చేపట్టారు. మంటల వద్ద నీటిని వేడి చేసుకుని స్నానాలకు వినియోగించారు.

గోపాలపట్నం : భోగి పండగ పురస్కరించుకుని వాడవాడలా వేడుకలు జరిగాయి. వీధుల్లో భోగిమంటలు వేసి ఉత్సాహంగా గడిపారు. వీధుల్లో యువకులు రహదారులపై భారీ మంటలు వేశారు. ఇళ్ల ముందు తీర్చిదిద్దిన రంగవల్లులు ఆకట్టుకున్నాయి.

పట్టణంలో ఉట్టిపడిన పల్లె కళ

మల్కాపురం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): హెచ్‌పీసీఎల్ నిర్వహణలో ఉన్న రామకృష్ణపురం హెచ్‌పీ మిలినీయం పెట్రోల్ బంకు సోమవారం సంక్రాంతి శోభ నింపుకుంది. పల్లెటూరును మరిపించేలా ఇక్కడ వేడుకల కోసం సెట్‌లు వేశారు. శ్రీహరిపురం మెయిన్ రోడ్డులో శ్రీనివాస స్వీట్స్ యజమాన్యం సంక్రాంతి సెట్‌ను తీర్చిదిద్దింది.



పల్లె వాతావరణాన్ని తలపించేలా ఏర్పాటు చేసిన సెట్



ఎస్టీబీఎల్ దివ్యక్షేత్రంలో గోదా రంగనాయకుల కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

గోదా రంగనాథుల కల్యాణం

అక్కిరెడ్డిపాలెం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం ఆఖరి రోజు, భోగి పండగ సందర్భంగా షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో సోమవారం గోదా రంగనాథుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. దివ్య క్షేత్రంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై గోదాదేవి, రంగనాథుల ఉత్సవ విగ్రహాలను అధిష్ఠింపజేసి హైందవ సంప్రదాయ పద్ధతిలో శాంతి కల్యాణాన్ని ప్రధాన అర్చకులు ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో వేదపండితులు జరిపారు. పాలక మండలి సభ్యులతో పాటు అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు. అలాగే బీహెచ్‌పీవీ ప్రసన్నగిరిపై గల శ్రీవేంకటేశ్వర వినాయక స్వామి దేవస్థానంలోని మండపంలో ప్రధాన అర్చకులు లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో వేదపండితులు గోదా రంగనాథుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు.

అగనంపూడి: ధనుర్మాసోత్సవాల ముగింపు సందర్భంగా 79వ వార్డు శాంతినగర్‌లో గల కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో గోదా రంగనాథుల కల్యాణాన్ని వైభవంగా జరిపారు. ప్రధాన అర్చకులు సత్యనారాయణ గోదా దేవి, రంగనాథుల కల్యాణాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించగా, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి కనులారా వీక్షించారు. ఆలయ ప్రాగణంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువు అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త ఈకే చారి, కమిటీ ప్రతినిధులు మేడిశెట్టి ఉమామహేశ్వరరావు, కృష్ణారావు, సాయిబ్‌నాయుడు, సోమశేఖర్, నరసింగరావు, గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం జరుపుతున్న అర్చకులు

రామాలయ కమిటీ ఆధ్వర్యంలో మేలుకొలుపు



మేలుకొలుపు కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

అగనంపూడి, జనవరి 13: జీవీఎంసీ 79వ వార్డు పరిధి లంకెలపాలెం రామాలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం భోగి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తి శ్రద్ధలతో మేలుకొలుపు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సీతారాముల వారిని పల్లకీలో ఉంచి భక్తి పాటలు ఆలపిస్తూ ఊరేగించారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు యర్రా కోటేశ్వరరావు, గుర్రం శంకరరావు, పి.రామచంద్రరరావు, వై.వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తిలోని వెంకటాద్రిపై కల్యాణోత్సవంలో ఉత్సవమూర్తులు

కమనీయం గోదా రంగనాథుల కల్యాణం

పెందుర్తి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక వెంకటాద్రి శిఖరంపై ఆలయంలో ధనుర్మాసోత్సవాలు ముగింపు సందర్భంగా సోమవారంగోదా రంగనాయకుల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. సుదర్శన మండపంలో ఏర్పాటుచేసిన వేదికపై అలంకార భూషితుడైన రంగనాయకులు, గోదాదేవిని ఆశీనులు గావించారు. ప్రధానార్చకులు మహర్షి రామానాజుచార్యులు ఆధ్వర్యంలో రుత్వికులు వేద మంత్రాల మధ్య శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు దంపతులతో పాటు 108 మంది జంటలు పాల్గొన్నాయి. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశారు. పాత పెందుర్తి రామాలయంలో కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు గోదావేవి కల్యాణం జరిపించారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద్ పల్లకిని మోశారు. చినముషిడివాడ సప్తగిరినగర్‌లోని అలివేలు మంగాదేవి ఆలయంలో గోదారంగనాథులు కల్యాణం జరిగింది. వంద మంది దంపతులు పాల్గొన్నారు.

మల్కాపురం : స్థానిక నగరాలవీధిలో సోమవారం గోదాదేవి కల్యాణోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలకు పల్లకిలో ఊరేగించారు. మల్కాపురం గ్రామ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు భోగవిల్లి నాగభూషణం, 61వ వార్డు టీడీపీ అధ్యక్షుడు మజ్జి సోమేష్ పాల్గొన్నారు. ప్రకాశనగర్ శివరామకృష్ణ ఆలయంలో సంక్రాంతి సంబరాలు జరిగాయి. స్వామి విగ్రహాన్ని తోపుడు బండిపై ఉంచి ఊరేగించారు. ఇండియన్ మారీటైమ్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో సింహాచలం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ఆలయ ప్రాంగణంలో గోదాదేవి నృత్యరూపకాన్ని ప్రదర్శించారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే పీజీవీఆర్ నాయుడు (గణబాబు) పాల్గొన్నారు.

వేపగుంట : నాయుడుతోట రవినగర్ శేషాద్రి కొండపై కొలువైన కల్యాణ వెంకటేశ్వరాలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా సోమవారం గోదాదేవి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఇందులో సుమారు 100 మంది పాల్గొన్నారు. అన్నదానానికి ఆర్థిక సాయం చేసిన కృష్ణమూర్తి, ధనలక్ష్మి దంపతులను ఈఓ బండారు ప్రసాద్ సత్కరించారు. బీసీ కాలనీ వెంకన్న ఆలయంలో గోదాదేవి కల్యాణం జరిగింది. లక్ష్మీనరసింహనగర్ గోపిజనవల్లభ స్వామి ఆలయంలో పూజలు చేశారు.



నాయుడుతోట రవినగర్‌లో గోదాదేవి కల్యాణం

ఎన్ఏడీ జంక్షన్ : జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్ వైకుంఠ వెంకటేశ్వరాలయంలో సోమవారం గోదాదేవి కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఇబ్బంది లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



రవినగర్‌లో జరిగిన ఉత్సవంలో పాల్గొన్న యువత

ఆనందాల భోగి


సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ భోగి మంట వద్ద అపార్టుమెంటు వాసుల సందడి


సీతంపేట వద్ద భోగి మంట


భీమిలిలో భోగి మంట వద్ద సందడి


పెంచిన విద్యుత్ చార్జీలకు నిరసనగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద కరెంటు బిల్లులను భోగి మంటల్లో వేస్తున్న సీపీఎం నాయకులు

నగరంతో పాటు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లోనూ భోగి పండగ సోమవారం ఉత్సాహంగా సాగింది. వేకువజామున నాలుగు గంటలకే భోగి మంట వేశారు. పలు వీధులు, అపార్టుమెంట్ల వద్ద యువత డీజేలు పెట్టి, మంటల చుట్టూ నృత్యాలు చేస్తూ సందడి చేశారు. మరోవైపు సింహగిరిపై అప్పన్న స్వామి సన్నిధిలో నిర్వహించిన సంక్రాంతి సంబరాలు అంబరాన్ని తాకాయి. వేలాది మంది భక్తులు ఉత్సవానికి తరలివచ్చారు. దేవస్థానం అధికారులు ముందుగా భోగి మంట వేసి వేడుకలకు శ్రీకారం చుట్టారు. రెల్లిగడ్డితో పూరి గుడిసెలు, ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు, చెరకు గడల జాలువలతో పాటు డూడూ బసవన్నలు, కొమ్ము దాసరులు, జంగమ దేవరలు, హరిదాసుల వేషధారణలు, ఎడ్ల బండి ప్రదర్శన, కపిలగోవు, గిత్తలు ఏర్పాటు చేసి, అచ్చం పల్లె వాతా వరణాన్ని సృష్టించారు. ఉత్సవానికి వచ్చిన వారికి గ్రామీణంలో ఉన్న అనుభూతి కలిగింది. అలాగే ఆర్‌కే బీచ్ పతంగుల ఎగురవేతతో కోలాహలంగా మారింది. చిన్నా పెద్ద తారతమ్యం లేకుండా ప్రతిఒక్కరూ గాలిపటాలు ఎగరవేసి ఉత్సాహంగా గడిపారు. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి


సింహగిరిపై గో పూజ చేస్తున్న మహిళలు


అప్పన్న కొండపై డూడూ బసవన్న, హరిదాసుల సందడి


ధాన్యపు రాశుల వద్ద మహిళల సందడి


ఆర్‌కే బీచ్‌లో పతంగులను ఎగురవేస్తున్న నగర వాసులు


తీరంలో పతంగులతో సందడిగా...

సింహగిరిపై వైభవంగా సంక్రాంతి సంబరాలు


వేడుకల్లో పాల్గొన్న వేలాది మంది భక్తులు


భోగి మంటను వెలిగిస్తున్న ఈఓ త్రినాథరావు

సింహాచలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సింహగిరిపై సంక్రాంతి సంబరాలు సోమవారం వైభవంగా జరిగాయి. సనాతన సంప్రదాయం, ఆచార వ్యవహారాలను ప్రతిబింబించే విధంగా మాడవీధుల్లో అధికారుల విస్తృత ఏర్పాట్లు చేశారు. ఉత్సవంలో భాగంగా వరాహలక్ష్మీనృసింహస్వామికి ప్రభాతారాధనలు తరువాత మాడవీధుల్లో ఏర్పాటు చేసిన భోగి మంటను ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, కార్యనిర్వాహక ఇంజినీరు బండారు రాంబాబుతో కలిసి దేవస్థానం ఈఓ వేంద్ర త్రినాథరావు లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం డూడూ బసవన్నలు, కొమ్మదాసరులు, జంగమదేవరలు హడావిడి చేశారు. ఈ సందర్భంగా మహిళలు వేసిన రంగవల్లులు అలరించాయి. సంప్రదాయంలో భాగమైన బొమ్మల కొలువును ఏర్పాటు చేశారు. వేడుకలకు వేకువజాము నుండే ఉమ్మడి విశాఖ జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు కుటుంబ సమేతంగా తరలిరావడంతో సింహగిరి కిటకిటలాడింది.

గ్రామీణ ఆచారం ప్రకారం సింహాద్రినాథునికి రైతులు పాలు, కూరగాయలు, నెయ్యి, నూనె మొక్కుబడులుగా సమర్పించారు.జానపద కళలతో పాటు విజయనగరానికి చెందిన పులివేష కళాకారుల ప్రదర్శనలు అలరించాయి, భక్తులకు నిత్యాన్న ప్రసాద విభాగం కింద బూరెలు, పరమాన్నం, పులిహోర వడ్డించారు.


స్వామివారి పల్లకి మోస్తున్న ఈఓ త్రినాథరావు, తదితరులు

వేణుధరుడిగా అప్పన్నస్వామి

సింహాచలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : వరాహలక్ష్మీనృసింహస్వామి సోమవారం సాయంత్రం వేణుధరుడిగా భక్తులకు దర్శనమిచ్చారు. రాపత్తు ఉత్సవాల్లో భాగంగా ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఉభయ దేవేరులతో శిరస్సున నెమలి పింఛమ్, చేతిలో పిల్లన గ్రోవి పట్టుకున్న శ్రీకృష్ణుడిగా అలంకరించిన తీరు భక్తులను విశేషంగా ఆకర్షించింది. గోపాలుడు అధిరోహించిన పల్లకిని భక్తులతో కలిసి దేవస్థానం ఈఓ మోసి భక్తి చాటుకున్నారు. నాదస్వరాలపనలు, వేదమంత్రోచ్చారణల నడుమ ప్రధాన మాడవీధుల్లో తిరువీధి ఉత్సవం వైభవం జరిపారు.

యువత సాయుధ దళాల్లో చేరాలి

- తూర్పు నావికాదళం వైస్ అడ్మిరల్ సమీర్ సక్సేనా
- సాయుధ దళాల డేర్-2 అయోధ్య యాత్ర ప్రారంభం


అయోధ్యకు వెళ్లే రైడర్లతో నేవీ అధికారులు

ఎండాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భారత నావికా దళం గురించి అవగాహన పెంపొందించడంతో పాటు యువతకు దేశ సేవ పట్ల ఆసక్తి కల్పించడానికి సాయుధ దళాల డేర్-2 అయోధ్య యాత్రను ప్రారంభించినట్టు తూర్పు నావికాదళం కమాండ్ వైస్ అడ్మిరల్ సమీర్ సక్సెనా అన్నారు. బజాజ్ ఆటో సంస్థ, భారత సాయుధ దళాల భాగస్వామ్యంతో విశాఖ నుంచి అయోధ్య వరకు 13 రోజుల పాటు డేర్ -2 పేరుతో నిర్వహిస్తున్న బైక్ ర్యాలీని సోమవారం ఆయన ఈఎన్‌సీలో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బజాజ్ సంస్థకు చెందిన పల్సర్ ఎన్‌ఎస్ -400 జెడ్‌పై 15 మంది రైడర్లు అయోధ్య వరకు (1600 కిలోమీటర్లు) యాత్ర చేపడతారని తెలిపారు. విశాఖ నుంచి ఐఎన్‌ఎస్ చిల్కా, భువనేశ్వర్, జంషెడ్‌పూర్, రాంచీ, గయా, వారణాసి మీదుగా గణతంత్ర దినోత్సవం నాటికి అయోధ్యలోని డోగ్రా రెజిమెంట్‌కు చేరుతుందన్నారు. బజాజ్ ఆటో సంస్థ మార్కెటింగ్ ప్రెసిడెంట్ సుమీత్ నారంగ్ మాట్లాడుతూ సాయుధ బలగాలు ధైర్యం ప్రదర్శించడంలో, సాహసాలు చేయడంలో ముందుంటాయని తెలిపారు. సాయుధ దళాలతో కలిసి దేశ సేవ చేయడం ఆనందంగా ఉందని చెప్పారు. అనంతరం డెవిల్ బైక్ రైడర్స్ చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో నావికాదళం అధికారులు, బజాజ్ ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆకట్టుకున్న డెవిల్ బైక్ రైడర్స్ విన్యాసాలు

భోగి మంటల్లో వీఆర్‌ఎస్ ఉత్తర్వులు

- తక్షణమే ఉపసంహరించుకోవాలని ఉక్కు పోరాట కమిటీ నాయకుల డిమాండ్


వీఆర్‌ఎస్ ఉత్తర్వులను భోగి మంటల్లో వేస్తున్న నాయకులు

ఉక్కుటౌన్‌షిప్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగమే వీఆర్‌ఎస్ ప్రకటన అని ఉక్కు పోరాట కమిటీ నాయకులు మండిపడ్డారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం ప్లాంట్ ప్రధాన పరిపాలన భవనం ముందు భోగి మంట వేసి అందులో వీఆర్‌ఎస్ ఉత్తర్వులను దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యమే చేయడమే లక్ష్యంగా కేంద్రం ముందుకు సాగుతుందని ధ్వజమెత్తారు. 130 శాతం ఉత్పత్తితో ముందున్న స్టీల్‌ప్లాంటును ప్రైవేటీకరణ చేయాలనుకోవడం అత్యంత దుర్మార్గమన్నారు. ఉక్కు ప్రైవేటీకరణపై పాలకులు స్పందించాలని డిమాండ్ చేశారు. ఉక్కు యాజమాన్యం వీఆర్‌ఎస్ ఉత్తర్వులను ఉపసంహరించుకునేంత వరకు పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు డి.ఆదినారాయణ, జె.అయోధ్యరామ్, పీవీ రమణమూర్తి, వరసాల శ్రీనివాసరావు, తౌడన్న, శ్రీనివాస్, యు.రామస్వామి, అప్పారావు, కారు రమణ, పల్లా పెంటారావు, తదితరులు పాల్గొన్నారు.

'కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవమే ధ్యేయం'

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం తెచ్చేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ నూతన్‌నాయుడు పిలుపునిచ్చారు. సోమవారం ఆయన జిల్లాలోని కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఫోర్ పాయింట్స్ హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి నాయకుడుతో పాటు కార్యకర్తకు కూడా తాను అందుబాటులో ఉంటానని, ఎవరికైనా సమస్య ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ నాయకుడు జగన్ మురారి, తదితరులు పాల్గొన్నారు.

111 ప్రత్యేక సర్వీసులు నడిపిన ఆర్టీసీ

విశాఖపట్నం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి నేపథ్యంలో ఆర్టీసీ సోమవారం 111 ప్రత్యేక సర్వీసులు నడిపింది. హైదరాబాద్‌కు ఐదు, విజయవాడకు పది, కాకినాడకు ఏడు, భీమవరం మూడు, అమలాపురం రెండు, శ్రీకాకుళం 30, విజయనగరం 25, పలాసకు ఐదు, ఇచ్ఛాపురానికి ఐదు, టెక్కలి నాలుగు, రాజాం నాలుగు, పార్వతీపురం ఎనిమిది చొప్పున సర్వీసులు నడిపారు.

కోళ్ల పందెం శిబిరంపై దాడి

ఎండాడ, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మధురవాడ మెట్ట ప్రాంతంలో కోడి పందాలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు పీఎంపాలెం ఎస్ఐ భాస్కరరావు సిబ్బందితో కలిసి సోమవారం దాడి చేశారు. పోలీసులను చూసి కొంతమంది పారిపోగా చుక్కా పైడిరాజు పట్టుబడ్డారు. అతని నుంచి రెండు కోళ్లు, రూ. 300 నగదు స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేశారు.

ముగ్గురు జూదరులపై కేసు నమోదు

పద్మనాభం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పేకాట ఆడుతున్న ముగ్గురు జూదరులపై సోమవారం కేసు నమోదు చేసినట్టు పద్మనాభం పోలీసులు చెప్పారు. కోరాడలో సచివాలయం వెనుక పేకాట ఆడుతున్నట్టు అందిన సమాచారం మేరకు సీఐ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడి చేసి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.5650 నగదు స్వాధీనం చేసుకున్నారు.